కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 1 డిసెంబర్ 2024

సంపుటి: 14, సంచిక: 242, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

నేటి నుంచి ట్రాయ్ కొత్త రూల్స్

ట్రేసబిలిటీ రూల్' ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ వంటి వాటిని అరికట్టేందుకు..
కమర్షియల్ మెసేజ్‌లను గుర్తించేందుకు కొత్త ఓటీపీ ట్రేసబిలిటీ రూల్

2

టీజీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

2

ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెళ్ళు

రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్లు

హంద్రీనీవాపై రూ.4,500 కోట్ల ఖర్చు

రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు కేటాయించాం

నేమకల్లులో పింఛన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు

నేమకల్లు నవంబర్ 30 (నిఘా న్యూస్): అణగారిన వర్గాలకు అండగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా నేమకల్లులో ఇంటింటికి పింఛన్ల పంపిణీలో సీఎం పాల్గొన్నారు. వితంతువు రుద్రమ్మ ఇంటికెళ్లిన సీఎం ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె కుటుంబసభ్యులతోనూ మాట్లాడారు. అనంతరం రుద్రమ్మకు స్వయంగా సీఎం పెన్షన్ అందించారు. ఇల్లు లేదని రుద్రమ్మ చెప్పడంతో వారికి వీల్కెనంత త్వరగా స్థలం కేటాయించి ఇల్లు కట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నేమకల్లులో దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంటికి సీఎం చంద్రబాబు వెళ్లారు. భాగ్యమ్మ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భాగ్యమ్మకు దివ్యాంగ పింఛను 15 వేల రూపాయలను అందించారు. నేరుగా ముఖ్యమంత్రి ఇంటికి వచ్చి పెన్షన్ అందించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.పింఛన్ల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన ..మిగతా 2లో

అభివృద్ధిని అడ్డుకుంటున్న... మానవ మృగాలు

1000 ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టుకున్న కేసీఆర్, 1300 ఎకరాల్లో పారిశ్రామికవాడను అడ్డుకుంటున్నాడు

లగచర్లలో చిచ్చుపెట్టి అమాయకులను జైల్లో పెట్టించారు

25 రోజుల్లో రూ.17,869 కోట్లు రుణమాఫీ చేశాం

దమ్ముంటే చర్చకు మోడియా, కేసీఆర్ ఎవరొస్తారో రండి

అప్పులు చేయకుండా భూములు అమ్మకుండా ప్రతి హామీని అమలు చేస్తున్నాము

పాలమూరుకు నిధులు తెచ్చి 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తా

కేసీఆర్ దోపిడీకి తెలంగాణ ప్రజలు బలైపోయారు

మహబూబ్‌నగర్ రైతు పండుగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): నల్లమల్ల ప్రాంతంలో పుట్టిన పాలమూరు బిడ్డను నేను. పులులను, మృగాలను ఎన్నో చూసిన. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మానవ మృగాలు.. నా కాలి గోటితో సమానం. నేను ఎవరికి భయపడేవాడ్ని కాదు'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరు అడ్డు వచ్చిన తొక్కుకుంటూ పాలమూరుకు నిధులు తెచ్చి 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 'రైతు పండుగ' సభలో సీఎం మాట్లాడారు. కేసీఆర్ పదేండ్ల అధికారంలో ఉండి ఏం చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. కాళేశ్వరం 1.50 లక్షల కోట్లతో ..మిగతా 2లో

పాలమూరు బిడ్డలు కేసీఆర్‌ను పల్లకిలో మోస్తే, ఆయన మా గుండెలపై తన్నిండు

ఎంపీ హోదాలో వయనాడ్‌కు ప్రియాంక

ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ

తిరువనంతపురం,నవంబర్ 30 (నిఘా న్యూస్): ప్రియాంకా గాంధీ ఇటీవలే కేరళలోని వయనాడ్ స్థానానికి జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. రెండు రోజుల క్రితం ఎంపీగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ హోదాలో ప్రియాంక తొలిసారి తన నియోజకవర్గం వయనాడ్‌కు వెళ్లారు. సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి శనివారం ఉదయం కేరళ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అక్కడ ఘన స్వాగతం లభించింది.కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ..మిగతా 2లో

ఐక్యరాజ్యసమితి మెచ్చుకున్న పార్టీ

ప్రపంచంలో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక పథకం రైతుబంధు

కేసీఆర్ సంక్షేమాలను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): ఆనాడు కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలపై ఐక్యరాజ్య సమితి సాగుకు పెట్టుబడి సాయం అందించి రైతన్నకు భరోసా కల్పించిన రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ పెట్టే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపడం సిగ్గుచేటని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుఅన్నారు. రైతుబంధు కంటే సన్నాలకిచ్చే ..మిగతా 2లో

వివిధ ప్రభుత్వ శాఖల్లోకి... టీటీడీలోని అన్యమతస్తుల బదిలీ

సర్వదర్శన భక్తులకు రెండు నుంచి మూడు గంటల్లోగా దర్శనం

కొండపై రాజకీయ ప్రసంగాలు నిషేధం

టీటీడీలోని పలు సేవలకు ఆధార్ అనుసంధానం

శ్రీనివాస సేతును గరుడ వారధిగా పేరు మార్చాలని నిర్ణయం

ముంతాజ్ హెూటల్ అనుమతి రద్దు

తిరుమల నవంబర్ 30 (నిఘా న్యూస్): తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవారి ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడిరచింది. గత కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు శ్రీవారి దర్శనం తరువాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడటం పరిపాటిగా మారింది. అప్పుడు రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేస్తున్నారు. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో తిరులమలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. ఆ నిర్ణయాన్ని తాజాగా అమలులోకి తీసుకువచ్చింది. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ పేర్కొంది.రాష్ట్రంలో ఎన్డీయే ..మిగతా 2లో

తెలంగాణలో చివరి దశకు

సమగ్ర కుటుంబ సర్వే

ఇళ్లకు తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

వివరాలను రహస్యంగా ఉంచుతున్న అధికారులు

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఉపాధి, విద్య, ఆర్థిక, రాజకీయ, కుల గణన తుది దశకు ..మిగతా 2లో

తుపాకీ తూటాకు చికాగోలో

తెలుగు విద్యార్థి బలి

ఖమ్మం నవంబర్ 30 (నిఘా న్యూస్): అమెరికాలో తుపాకీ తూటాకు మరో తెలుగు విద్యార్థి బలయ్యాడు. చికాగోలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 26 ఏళ్ల సాయి తేజ అనే విద్యార్థి మరణించాడు. అతడు ఖమ్మం రూరల్ జిల్లా రామన్న పేటకు చెందిన వాడిగా ..మిగతా 2లో

ఇరిగేషన్‌లో అవినీతి ఊటలు

ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

ఏఈఈ నిఖేష్ కుమార్ అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణ ఏసీబీ వలకు భారీ అవినీతి తిమింగలం చిక్కింది. నీటిపారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్ నివాసంలో ఏసీబీ ఏకకాలంలో సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. నిఖేష్ ఇంటితో పాటు బంధువుల నివాసాలలో 25 నుంచి 30 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఏసీబీ ప్రాథమిక సమాచారం ప్రకారం నిఖేష్ కుమార్ ఆస్తుల విలువ రూ.150 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో ఏఈఈ నిఖేష్ కుమార్ కు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 25 ప్రదేశాలలో ఏసీబీ దాడులు చేసింది. తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. నిఖేశ్ కుమార్ గతంలో ..మిగతా 2లో

డిసెంబర్ 5న మహా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం

అయితే ముఖ్యమంత్రి పీఠంపై కొనసాగుతున్న సస్పెన్స్

మహారాష్ట్ర సీఎం రేసులోకి మురళీధర్ మోహెూల్

సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం

ముంబై, నవంబర్ 30(నిఘా న్యూస్): మహా సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది. దేవేంద్ర ఫడ్నవీస్ లేదా ఏక్‌నాథ్ షిండేనా సీఎం ఎవరన్నది తేలిపోయే క్రమంలో మహాయుతి మీటింగ్ రద్దవ్వడం షిండే స్వగ్రామానికి వెళ్లిపోవడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో మహారాష్ట్ర సీఎం ఇంకా ఎవరో తేలలేదు. కాని కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం తేదీ మాత్రం ఖరారయ్యింది. డిసెంబర్ 5వ తేదీన మహారాష్ట్ర కొత్త కేబినెట్ ప్రమాణం చేస్తుంది. ముంబై ..మిగతా 2లో

ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో

'ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల అంశంపై కీలక ఉపన్యాసం

ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడి

న్యూఢిల్లీ నవంబర్ 30 (నిఘా న్యూస్): భారతదేశంలో అంతరిక్ష కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. వారి సహకారంతో గ్లోబల్ మార్కెట్‌లో దేశం మరింత వాటాను పొందగలదని ఆయన అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో మరింత వాటాను కైవసం చేసుకునేందుకు భారత్ తన అంతరిక్ష కార్యకలాపాలను పెంచుకోవాలని చూస్తోంది. శుక్రవారం ..మిగతా 2లో

అభివృద్ధిని అడ్డుకుంటున్న మానవ మృగాలు

మొదటి పేజీ తరువాయి...

కడితే కుక్కతోక తగిలి కూలిపోయిందని విమర్శించారు. కేసీఆర్ 7లక్షల కోట్లు అప్పు చేస్తే వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం 60 వేల కోట్ల వడ్డి కట్టిందన్నారు. అప్పులు చేయకుండా భూములు అమ్మకుండా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. వరి వేస్తే ఉరి అన్నావు. కానీ, దేశ చరిత్రలో రైతులు రికార్డు స్థాయిలో 1.53 లక్షల మెట్రిట్ టన్నుల వడ్లను పండించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో పిడుగులు పడుతున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఎంతో దోపిడీ చేసిందని, కేసీఆర్ దోపిడికి రాష్ట్రం బలైపోయిందన్నారు. కేసీఆర్‌కు ఈ వేదికగా సవాల్ విసురుతున్నా 25 రోజుల్లో రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందా నిరూపించండి అని సవాలు విసిరారు. మోడీ వస్తరో. కేసీఆర్ వస్తరో రండి. చర్చిద్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్కరుగా వస్తారో, అందరూ కలిసి వస్తారో రండి.అసెంబ్లీలో చర్చిద్దామన్నారు. రైతు రుణమాఫీ చేసిన చరిత్ర, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర మాది. రైతు బీమా తెచ్చింది కాంగ్రెస్. వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్.రైతు సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్ అని రేవంత్‌రెడ్డి అన్నారు.

లగచర్లలో చిచ్చుపెట్టి అమాయకులను జైల్లో పెట్టించారు.

కేసీఆర్ 1000 ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టుకున్నావ్ కానీ 1300 ఎకరాల్లో పారిశ్రామికవాడ వద్దా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి జరగాలంటే కొందరు నష్టపోక తప్పదు. వారికి కావాల్సిన నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని.. పరిహారం రూ. 10 లక్షలు కాకపోతే రూ రూ.20 లక్షలు ఇచ్చే శక్తి తన దగ్గర ఉందన్నారు. నా ప్రాంత అభివృద్ధి కోసం, ఇక్కడి యువత కోసం కొడంగల్ లో పారిశ్రామిక వాడ నిర్మించాలనుకుంటే..లగచర్ల చిచ్చు పెట్టి అమాయక లంబాడాలను జైల్లో పెట్టించారని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు మాయమాటలు నమ్మి అమాయక లంబాడాలు జైలుకు పోయారు. నేను ఆనాడే వాళ్ల మాయ

మాటలు నమ్మొద్దని చెప్పానని రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కమీషన్ల కక్కుర్తి కోసం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు తీసుకెళ్లిండు. అలాంటిది మన గడ్డ అభివృద్ధికి లక్ష కోట్లు తెచుకోలేమా అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు అధికారులపై దాడులు చేసి ఉంటే నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యేవా అని ప్రశ్నించారు. నేను ఇక్కడ పుట్టినోన్ని.. ఇక్కడి మట్టిలో కలిసే వాణ్ణి.ఈ ప్రాంతంపై నాకంటే ఎక్కువ ప్రేమ ఎవరికి ఉంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు.

పదేళ్లలో రైతు రుణమాఫీ జరిగిందా

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతు రుణమాఫీ జరిగిందా, రైతుకు గిట్టుబాటు ధర లభించిందా అని రేవంత్ ప్రశ్నించారు. ఆనాడు ఔటర్ రింగ్ రోడ్డును రూ.7500 కోట్లకు అమ్మి ఐదేళ్లలో వాళ్లు రుణమాఫీకి ఖర్చు చేసిందన్నారు. రూ 11వేల కోట్లేనని కానీ రూ.11 వేల కోట్లలో రూ. 8596 కోట్లు మిత్తికే పోయినయ్. రైతులకు చెల్లించింది కేవలం రూ.2500 కోట్లేనని రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని రేవంత్‌రెడ్డి అన్నారు. 2023 నవంబర్ 30కు దేశ రాజకీయాల్లోనే ఒక గొప్ప ప్రాధాన్యత ఉందని దోరల గడీల కూప్పకూల్చి ప్రజాప్రభుత్వం తీసుకొచ్చారని సీఎం రేవంత్ అన్నారు. పని చేయడమే మనకు తెలుసు. పనిలోపడి చేసింది చెప్పుకోలేకపోతున్నాం. మాకు ఏ బ్రాండ్ అంబాసిడర్లు అవసరం లేదు.ప్రజలే మా బ్రాండ్ అంబాసిడర్స్ అని రేవంత్‌రెడ్డి అన్నారు.

పాలమూరు బిడ్డల్ని కేసీఆర్ గుండెల మీద తన్నిండు..

కేసీఆర్ పాలమూరు బిడ్డలు నిన్ను పల్లకిలో మోస్తే మా గుండెలపై తన్ని వలసలు పెరిగేలా చేసింది నువ్వు కాదా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వెనుకపడ్డ పాలమూరుని చంద్రబాబు, రోశయ్య, కేసీఆర్ దత్తత తీసుకుంటామని అభివృద్ధి చేయలేదన్నారు. ఎవడో వచ్చి పాలమూరును దత్తత తీసుకోవడంకాదు.. మీ పాలమూరు బిడ్డనే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకుందామా అని ప్రశ్నించారు. కొండారెడ్డిపల్లి నుంచి రైతు బిడ్డగా బయలుదేరి అందరి కష్టాలను చూశానని, 70 ఏండ్ల తర్వాత ఈ ప్రాంత వ్యక్తి సీఎం అయ్యారని ఈ అవకాశం ఆశామాషీగా రాలేదన్నారు. ఇప్పుడు మేము నారాయణ్ పేట్, కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తామంటే మాత్రం కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని. పాలమూరుకు నీళ్లు తెస్తామంటే కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు అడ్డు పడుతున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మనం పూర్తి చేసుకోవద్దా ఓకే సంతకంతో మన జిల్లాకు కావాల్సిన అన్ని నిధులు తెచ్చుకుందామన్నారు. కానీ, వాళ్ల సోయిలో పడి మోసపోవద్దని వారు మిమ్మల్ని ముందు పెట్టి పోయి ఫామ్ హౌస్‌లో ఉంటారన్నారు. కేసీఆర్ నీ మొసలి కన్నీరు పాలమూరు జిల్లాపై కాదన్నారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తే ఒక తరం పరిస్థితే మారుతుంది. అలాంటి అవకాశం మీరు కోల్పోవద్దన్నారు. పారిశ్రామిక వాడ తెచ్చి 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే జిమ్మేదారి నాదని రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు బిడ్డగా కొండారెడ్డి నుంచి బయలుదేరి అందరి కష్టాలు చూసి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఏడాదికి 20వేల కోట్లు మా జిల్లాకు ఇవ్వాలని మీ తరపున మా మంత్రి వర్గాన్ని తాను అడుగుతానని రేవంత్‌రెడ్డి అన్నారు.

నేటి నుంచి ట్రాయ్ కొత్త రూల్స్

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): మోసపూరిత మెసేజ్‌లు రాకుండా టెలికాం సంస్థలు వాటిని నిరోధిస్తాయి. అయితే, ఈ కొత్త రూల్స్ ద్వారా బ్యాంకింగ్ వంటి ముఖ్యమైన లావాదేవీల ఓటీపీలు ఆలస్యమవుతాయనే ఆందోళన పెరిగింది. కానీ, ట్రాయ్ నిభందనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటామని, మీ సేవలు ఆలస్యం కాకుండా చూస్తామని స్పష్టం చేసింది. దీనితో ఫేక్ ఓటీపీలు రాకుండా ప్రజలు మోసపోకుండా ఉండడానికే ఈ కొత్త రూల్ తీసుకొచ్చారు. ఆధార్ అప్‌డేట్ చాయాలంటే రూ. 50 చెల్లించాలి. అది కేవలం గడువు తేదీ దాటితే, ఇటీవల యుఐడీఐ ఆధార్ కార్డులో వివరాలను ఉచితంగా అప్డేట్ చేసుకోమని చెప్పింది. అందుకోసం డిసెంబర్ 14వ తేదీ వరకూ గడువుని ప్రకటించింది. గడువు తేదీ లోపు ఆధార్ కార్డులో పేరు, అడ్రస్, చిరునామా వంటి వివరాలను ఫ్రీగా చేసుకోవచ్చు. కానీ తేదీ దాటితే ఈ ఉచిత అప్‌డేట్ ఆప్షన్ పోతుంది. ఆ తర్వాత ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.50 ఆపైన చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి తొందరగా అప్‌డేట్ చేసుకోమని యుఐడీఐ చెప్తోంది. ప్రతి ఏటా ఒక వ్యక్తి లేదా సంస్థ ఆదాయాన్ని, వ్యయాలను, పన్నులను మూడవ వర్గీకరణలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలి. ఈ ప్రక్రియ ద్వారా, ప్రతి వ్యతిరేక ఆదాయాన్ని ప్రకటించడం, పెట్టుబడులు ఖర్చులను గణించడం, తద్వారా వారి ఆదాయ పన్నును సరిగ్గా చెల్లించడం జరుగుతుంది. ఇది ఒక పన్ను చెల్లింపుదారుని ఆర్థిక స్థితిని అంచనా వేయడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది. ఐటీ రిటర్న్‌ను సరిగ్గా సమయానికి ఫైల్ చేయడం అత్యంత ముఖ్యం, ఎందుకంటే ఆలస్యం అయినా, లేదా తప్పుగా ఫైల్ చేసినా, దానికి జరిమానాలు, పన్ను తిరిగి పొందడంలో ఇబ్బందులు లేదా ఇతర పరిమితులు వచ్చే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీఆర్ దాఖలు చేసేందుకు డిసెంబర్ 31 వరకు ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ గడువు ఇచ్చింది. దీనినే బిలేటెడ్ ఐటీ రిటర్న్స్ అంటారు. పెనాల్టీతో ఫైల్ చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత అయితే ఫైల్ చేయడానికి లేదు. ఫైల్ చేయనివారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది.

ఎంపీ హోదాలో వయనాడ్‌కు ప్రియాంక

మొదటి పేజీ తరువాయి...

ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష రాజీకాయాల్లోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. గత శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు. ఈ క్రమంలోనే గురువారం లోక్‌సభలో ఎంపీగా ప్రమాణం చేశారు. కేరళ సంప్రదాయ కసావు చీర కట్టుతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన ప్రయాంక ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు.

డిసెంబర్ 5న మహా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ తరువాయి...

ఆజాద్ మైదాన్ వేదికగా ముఖ్యమంత్రితో పాటు కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారంటూ ప్రకటన విడుదల్కెంది. డిసెంబర్ 3వ తేదీన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో సీఎం ఎంపిక జరుగుతుంది. అయితే ఫడ్నవీస్‌కే సీఎం పదవి దక్కుతుందా లేక అనూహ్యంగా కొత్త నేతకు బీజేపీ అవకాశ ఇస్తుందా, ఈవిషయంపై క్లారిటీ రావడం లేదు. ఈ తరుణంలో కొత్త పేరు తెరపైకి రావడం, ఆ వ్యక్తి స్వయంగా స్పందించడం హాట్ టాపిక్ గా మారింది. దేవేంద్ర ఫడ్నవీస్‌కు బదులుగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) అగ్ర నాయకత్వం మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా కేంద్ర పౌర విమానయాన, సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్‌ను నియమిస్తారని సోషల్ మీడియాలో ఊహాగానాలు వ్యాపించాయి. దీనిపై వెంటనే మురళీధర్ మోహోల్ స్పందించారు. (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన పూణె ఎంపీ ఈ ఊహాగానాలు నిరాధారమైనవి కల్పితమంటూ కొట్టిపారేశారు. సోషల్ మీడియాలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి నా పేరు ప్రకటనపై ఊహాగానాలు నిరాధారమైనవి, కల్పితం. బిజెపి నేత, మా నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడిరది. మహారాష్ట్ర ప్రజలు కూడా చారిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారు. అంటూ పేర్కొన్నారు. బీజేపీలో సోషల్ మీడియా ఊహాగానాల ద్వారా కాకుండా పార్లమెంటరీ బోర్డు ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఒకసారి పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకుంటే, పార్టీ నిర్ణయమే మాకు సుప్రీం. అందుకే సోషల్ మీడియాలో నా పేరుపై ఊహాగానాలు అర్థరహితం. అంటూ మురళీధర్ మోహోల్ క్లారిటీ ఇచ్చారు. కాగా ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి 230 స్థానాల్లో భారీ ఆధిక్యం సాధించింది. బీజేపీ 132 సీట్లు గెలుచుకోగా, దాని మిత్రపక్షాలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57 సీట్లు, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 41 సీట్లు గెలుచుకున్నాయి. మహా వికాస్ అఘాడి కూటమి ఘోరమైన పరాజయాన్ని చవిచూసింది. శివసేన 20 సీట్లు, కాంగ్రెస్ 16, శరద్ పవార్ వర్గం 10 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.చారిత్రాత్మకమైన ఫలితాన్ని పొందినప్పటికీ, ఓట్ల లెక్కింపు ముగిసిన ఏడు రోజుల తర్వాత మహాయుతి కూటమి ముఖ్యమంత్రిపై నిర్ణయం తీసుకోలేదు. ఏక్‌నాథ్ షిండేను నియమించేందుకు బీజేపీ విముఖత చూపడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారని ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. వినోద్ తావ్డే, రాధాకృష్ణ విఖే-పాటిల్ వంటి ప్రత్యామ్నాయ పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఫడ్నవీస్ సీఎంగా ఉంటారని డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్ ఉంటారంటూ పేర్కొంటున్నారు. దీనిపై క్లారిటీ రావాలంటే మరో మూడు రోజులు ఆగాల్సిందే.

తెలంగాణలో చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

మొదటి పేజీ తరువాయి...

చేరుకుంది. ఏ రోజుకు ఆ రోజు ఎన్యుమరేటర్లు ఇళ్లకు తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం వాటిని ఆన్‌లైన్లో పొందుపరుస్తున్నారు. అలాగే ఇళ్లలో లేని వారికి ఫోన్ చేసి మరీ వివరాలు సేకరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిబంధన ప్రకారం సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో ఉండి నగరంలో సెటిల్ అయిన వారు సైతం ఇక్కడే తమ వివరాలను ఇస్తున్నారు. అందుకు సంబంధించిన ధ్రువ పత్రాలను అందిస్తున్నారు. మ్మడి మెదక్ జిల్లాలో ఐదు పట్టణాలు, 26 గ్రామీణ మండలాలు ఉన్నాయి. ఈ కుటుంబాల వివరాలను సర్వే చేసేందుకు బ్లాకులుగా విభజించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 వరకు కుటుంబాలను కేటాయించి వివరాలు సేకరించే పనిని ఇచ్చారు. కేటాయించిన ప్రకారం ఎన్యుమరేటర్లు వివరాల సేకరించారు. నవంబర్ 6న సర్వే ప్రారంభం కాగా 8వ తేదీ వరకు కుటుంబాలను గుర్తించి గృహాలకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టారు. ఓ వైపు సర్వే కొనసాగుతుండగానే మరో వైపు సేకరించిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసే పనిని ఆపరేటర్లు మొదలు పెట్టారు.ప్యూటర్లు ఎక్కువగా ఉన్న ఇతర కార్యాలయాలు, పాఠశాలల్లోనూ సర్వే డేటా నమోదు ప్రక్రియ చేస్తున్నారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లతో పాటు ఇతర అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. సర్వే వివరాలు బయటకు వెళ్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. వివరాలు బయటకి వెళ్లకుండా రహస్యంగా ఉంచుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాల నమోదు 70 శాతం పైగా పూర్తి అయింది.

ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెళ్ళు

మొదటి పేజీ తరువాయి...

గ్రామసభలో సీఎం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 64లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా పింఛను ఎక్కువగా ఇచ్చే రాష్ట్రం మనదేనని తెలిపారు. పింఛన్ల కింద 5 నెలల్లో రూ.18వేల కోట్లు ఇచ్చామని పెంచిన పింఛన్లు ఏప్రిల్ నుంచి ఇచ్చామని తెలిపారు. పింఛను 3 నెలలకోసారి తీసుకునే సౌకర్యం కల్పించామని అన్నారు. లబ్ధిదారుల్లో కూలీలు, కార్మికులు ఉన్నారనే ఇలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల్లో ఆనందం శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. అనంతపురం జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. రాయదుర్గం వెనకబడిన ప్రాంతమని ఈ నియోజకవర్గం ఏడారిగా మారకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. హంద్రీనీవాపై రూ.4,500 కోట్లు, రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టామని సీఎం వివరించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కష్టపడి పనిచేసి సంపద పెంచి పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 50 లక్షల మంది గ్యాస్ బుక్ చేసుకున్నారని సిలిండర్‌కు చెల్లించిన డబ్బు 48 గంటల్లో రిఫండ్ చేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లు ఇసుక దొరక్క లక్షల మంది కూలీలు ఉపాధి కోల్పోయారని ఇక ఇసుక విషయంలో ఎవరు అడ్డువచ్చినా ఊరుకునేది లేదని చంద్రబాబు అన్నారు.నా విజన్ వల్ల దేశంలోనే నెంబర్‌వన్ నగరంగా హైదరాబాద్ తయారైందని సీఎం అన్నారు. 2047 నాటికి దేశంలోనే ఏపీ నెంబర్‌వన్ రాష్ట్రంగా మారాలన్నారు. ప్రపంచాన్ని శాసించే శక్తియుక్తులు మన పిల్లలకున్నాయని, పిల్లలను చదివించాలి, వారిలో నైపుణ్యాలు పెంచాలని సూచించారు. స్థానిక సంస్థల్లో పోటీకి పిల్లల నియంత్రణ చట్టం తీసేశామని తెలిపారు. చదువుకున్న యువతే మన రాష్ట్రానికి పెద్ద ఆస్తి అని చంద్రబాబు అన్నారు. గతంలో నాసిరకం మద్యంతో విచ్చలవిడిగా దోచుకున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన మద్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. మత్తుపదార్థాల నిర్మూలనకు ఈగల్ పేరుతో డేగకన్ను ఉంచామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ విషయంలో కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, గంజాయి మాఫియా లేకుండా చేస్తామని సీఎం అన్నారు. రేషన్ బియ్యం కొని విదేశాలకు అమ్ముతున్నారని అలాంటి అక్రమ వ్యాపారులపై కఠినచర్యలు ఉంటాయని అన్నారు.ప్రతి గ్రామంలో సోలార్ ప్యానళ్లు పెరగాలని ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏ గ్రామం చూసినా పరిశుభ్రంగా కనిపించాలని చెత్తాచెదారంతో కనిపించకూడదని అన్నారు. రాయదుర్గంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, కణేకల్, బొమ్మనహాళ్‌లో ఇసుక మేటలు పెరగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎక్కువమందికి ఉపాధి ఇచ్చే పరిశ్రమలకు ఎక్కువ రాయితీ ఇస్తామని తెలిపారు. ఐదు నెలల్లోనే నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని అవి వస్తే వస్తే 4 లక్షల మందికి ఉపాధి వస్తుందని సీఎం చంద్రబాబు వివరించారు.ఎక్కడ అవినీతి జరిగినా ఆయా అధికారులపై చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇంటికివచ్చి లంచం అడిగారా అని ప్రజలను అడుగుతామని అన్నారు. అభిప్రాయాలు చెప్పేటప్పుడు ప్రజలు వాస్తవాలే చెప్పాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిత్యం పనిచేస్తామని తెలిపారు. బిందు, తుంపర సేద్యానికి మళ్లీ ప్రాధాన్యత ఇస్తామని సీఎం తెలిపారు.

ఐక్యరాజ్యసమితి మెచ్చుకున్న పార్టీ

మొదటి పేజీ తరువాయి...

రూ.500 బోనసే మేలని రైతులు చెబుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి చెప్పడం శోచనీయమన్నారు. ప్రపంచంలో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక పథకం రైతుబంధు అని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం రూపుమాపే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 5,19,605 క్వింటాళ్ల సన్న వడ్లను క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ లెక్కన రైతులకు దక్కిన బోనస్ సుమారు రూ.26 కోట్లు మాత్రమేనని చెప్పారు. అదే రైతుబంధు కింద ఏడాదికి రూ.7,500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని వెల్లడిరచారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తే ఇది ఇంకా ఎక్కువ అవుతుందని తెలిపారు. మరి రైతు బంధు కంటే, బోనస్ అందించడం రైతులకు మేలు ఎట్లవుతుందో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ సగం మందికి చేసి, సగం మందికి మొండి చేయి చూపారని విమర్శించారు. ఆ తర్వాత అన్ని పంటలకు బోనస్ అని, చివరకు సన్నాళ్లకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రైతుబంధును శాశ్వతంగా రద్దు చేసే ప్రయత్నం మొదలుపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధును బందు చేస్తారని కేసీఆర్, ముందే హెచ్చరించారని గుర్తుచేశారు. అనుకున్నట్టే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నదని చెప్పారు. రైతు భరోసా వస్తదని ఎదురుచూస్తున్న రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు మోసపోయినట్లేనా అని ప్రశ్నించారు. రైతులను విజయవంతంగా మోసం చేసినందుకు రైతు పండుగ నిర్వహిస్తున్నావా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. మేనిఫెస్టోలో చెప్పి, రైతులను నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా చేసినందుకు విజయోత్సవాలా రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రైతుల బతుకులు మార్చేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని నిలిపివేసే కుట్రను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే కార్యక్రమంలో రైతు బంధు అమలుపై స్పష్టత ఇవ్వాలని, పెండిరగ్‌లో ఉన్న వానకాలం రైతుబంధుతో పాటు, యాసంగికి పంట పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో

మొదటి పేజీ తరువాయి...

(నవంబర్ 29) కేరళ స్టార్టప్ మిషన్ నిర్వహించిన దేశ ఫ్లాగ్‌షిప్ స్టార్టప్ ఫెస్టివల్ హడిల్ గ్లోబల్ 2024లో 'ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. తిరువనంతపురంలో కేరళ స్టార్టప్ మిషన్ కార్యక్రమం 'హడిల్ గ్లోబల్ 2024'లో 'ఇస్రో విజన్ భారతదేశంలో అంతరిక్ష సాంకేతిక సంస్థల పెరుగుదలపై ఎస్. సోమనాథ్ మాట్లాడుతూ అంతరిక్ష శక్తిగా గుర్తించబడినప్పటికీ, ప్రపంచ వ్యాపారంలో భారతదేశం వాటా కేవలం రెండు మాత్రమే. శాతం అంటే 386 బిలియన్ డాలర్లు. 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు, 2047 నాటికి 1,500 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ యోచిస్తోందన్నారు. ప్రైవేట్ రంగానికి వాణిజ్య కార్యకలాపాలకు ఉన్న అవకాశాలను సూచిస్తూ, భారతదేశంలో కేవలం 15 కార్యాచరణ అంతరిక్ష ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయని, ఇది చాలా తక్కువ అని సోమనాథ్ అన్నారు. అంతరిక్ష సాంకేతికతలో భారత్‌కు ఉన్న నైపుణ్యం, పెరుగుతున్న ఉపగ్రహాల తయారీ కంపెనీల దృష్ట్యా కనీసం 500 ఉపగ్రహాలను అంతరిక్షంలో ఉంచగల సామర్థ్యం మన దేశానికి ఉందని సోమనాథ్ తెలిపారు. "ప్రస్తుత మార్కెట్‌లో అనేక ప్రైవేట్ సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి ఉపగ్రహాలను తయారు చేసి వాటిని కక్ష్యలో ఉంచగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రైవేట్ 'లాంచ్‌పాడ్‌లు' కూడా నిర్మిస్తున్నాయి. 2014లో అంతరిక్ష సంబంధిత స్టార్టప్‌లు ఒక్కటే ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 250కి పైగా పెరిగింది. 2023లోనే స్పేస్ స్టార్టప్ విభాగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని సోమనాథ్ తెలిపారు. పెద్ద కంపెనీలు ఇప్పుడు అంతరిక్ష రంగానికి చురుకుగా సహకరిస్తున్నాయని సోమనాథ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.భారతదేశం అంతరిక్షంలో తన కార్యకలాపాలను ఇంటర్-ప్లానెటరీ అన్వేషణకు విస్తరించడంతో, భారతదేశం మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్ , భారత అంతరిక్ష కేంద్రం వంటి భవిష్యత్ ప్రాజెక్టులు కూడా ప్రైవేట్-రంగం మధ్య సహకార ప్రయత్నాలుగా ఉంటాయని సోమనాథ్ తెలిపారు. చిన్న ఉపగ్రహాలు, జియోస్పేషియల్ సొల్యూషన్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఆర్బిటల్ ట్రాన్స్‌ఫర్ వెహికల్స్ వంటి మరెన్నో రూపకల్పన, ప్రయోగాలలో ప్రైవేట్ రంగ ప్రమేయానికి అపారమైన అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇస్రో ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించామని, అంతరిక్ష రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని సోమనాథ్ పేర్కొన్నారు.

టీజీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

హైదరాబాద్ నవంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా సీనియర్ ఐఏ

ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ సేవలు

- సమిష్టి కృషితోనే పటాన్ చెరు ప్రభుత్వాసుపత్రికి జాతీయ అవార్డు
- వైద్యులు, వైద్య సిబ్బందికి ఘన సన్మానం

పటాన్ చెరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా చెందిన పటాన్చెరు నియోజకవర్గ కేంద్రంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి ఉత్తమ సేవలు విభాగంలో జాతీయ స్థాయిలో ఏడవ స్థాయి అవార్డు రావడం సమిష్టి కృషి మూలంగానే సాధ్యమైందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సెంట్రల్ క్వాలిటీ సూపర్వైజర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ సమీక్షలో మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో 7వ స్థానం సాధించిన సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అవార్డు రావడానికి కృషి చేసిన వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంలో ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్లు, ఆపరేషన్ థియేటర్లు, జనరేటర్లను ఏర్పాటు చేయడంతో పాటు సిఎస్సార్ నిధులతో వివిధ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ఏడవ స్థానం దక్కడం నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి గర్వకారణమని ఎంఎల్ఏ జిఎంఆర్ అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని అవార్డులు సాధించాలని అభిలషించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. 350 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పటాన్చెరులో చేపడుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లలిత సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్ప, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా వైద్యాధికారి గాయత్రీ, డిసిహెచ్ఎస్ అధికారి సంగారెడ్డి, మాజీ జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, విజయభాస్కర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ రెడ్డి, ఎంపీడీవో యాదగిరి, ఎమ్మార్వో రంగారావు, కంకర సీనయ్య, బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఎంవో ప్రవీణ, ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ వసుందర, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహ రెడ్డి, అఫ్జల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాన్ నగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే

యాఖత్‌పుర, నవంబర్ 30 (నిఘా న్యూస్): తలాబ్ చంచలం డివిజన్ పరిధిలో యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ఖాన్ నగర్ లో కొనసాగుతున్న సివరేజ్ లైన్ పనులను పరిశీలించారు. పనుల పురోగతి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని, పనుల్లో తప్పకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సమీనా, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా సభల పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభ డిసెంబర్ 7,8 తేదీలలో కుత్బుల్లాపూర్ లో జరుగనున్నాయి. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సిపిఎం పార్టీ ఉప్పల్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల్ బీరప్ప గడ్డ లో మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ మహాసభల సందర్భంగా సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డిజి నరసింహారావు, పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి పి.సత్యం పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం.వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు ఎస్.నాగరాజు, పెద్ద స్వామి, వై.వెంకటేశ్వర్లు, ఎన్.పద్మ, ఊర్మిళ, ఉపేందర్, భీష్మ చారి, సిపిఎం పార్టీ నాయకులు బాలయ్య, వెంకటేష్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి 50 వేల విరాళం

గోకవరం, నవంబర్ 30 (నిఘా న్యూస్): గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గంగాభవాని నగర్ కాలనీలో నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయానికి 50 వేల విరాళం అందజేసిన అతి సామాన్య మహిళ. రంప ఎర్రంపాలెం గంగాభవాని నగర్ లో సుమారు 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయానికి అదే గ్రామానికి చెందిన కడవల వీరన్న కుమార్తె, కడవల సూర్యావతి 50 వేల రూపాయల విరాళం అందజేశారు. ఆమె అతి సామాన్యమైన పేద మహిళ, భర్తను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలను పోషించుకుంటూ చిన్న టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆమెకు అమ్మవారు అంటే అపారమైన భక్తి .తను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, పేదరికంలో అమ్మవారి భవ్య మందిరంలో తన శక్తికి మించి విరాళాన్ని అందించిన ఆమె భక్తి భావాన్ని ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు అభినందించారు.

ఘనంగా నాగులపల్లి చర్చి వార్షికోత్సవం

తూప్రాన్, నవంబర్ 30 (నిఘా న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని నాగులపల్లి గ్రామంలో చర్చి ప్రారంభించి సంవత్సరం కావస్తున్న సందర్భంగా నాగులపల్లి చర్చిలో వార్షిక వేడుకలను స్థానిక పాస్టర్ దేవదానం ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది. ఇందులో భాగంగా ప్రభువైన క్రీస్తును ఆరాధిస్తూ పాటల ద్వారా ఘనపరచడం జరిగింది. ఈ చర్చి నిర్మాణానికి ఆర్థికంగా, వస్తు రూపకంగా సహాయం అందించిన వారికి స్థానిక పాస్టర్ దేవదానం అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో మండల పరిధిలోని వివిధ చర్చిల పాస్టర్లను పిలిచి వారిని శాలువాతో సన్మానం చేశారు.

డా.శారద సేవలు అభినందనీయం

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ

వికారాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): వికారాబాద్ జిల్లా పరిధిలోని మోమిన్ పేట్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా ఆరోగ్య అధికారినిణిగా విధులు నిర్వహిస్తున్న శారద పదవి విరమణ పొందారు. దీంతో మండల వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ సుజల ఆధ్వర్యంలో పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బుచ్చిబాబు హాజరై పదవి విరమణ పొందిన శారదకు పూలమాలలతో, శాలువలతో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎఓ చండీశ్వరి, డాక్టర్ రషీద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుదేశం సభ్యత్వ నమోదు ప్రారంభం

చిలుకా నగర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): చిలుకా నగర్ డివిజన్ లో డివిజన్ నాయకులు డాక్టర్.అశోక్ ఆధ్వర్యంలో శనివారం చిలుకా నగర్ చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ఆదరణ తగ్గలేదని ఎన్టీ రామారావు నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ ప్రజలు ఎప్పుడు మర్చిపోరని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. పలువురు పార్టీ నాయకులను తెలుగుదేశం పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తిక్క ప్రకాష్, అవినాష్, ఇమామ్, మౌలాలి దూదేకుల, చంద్రయ్య, సిద్దయ్య, మల్లేష్, అంజి గౌడ్, మధుసూదన్ రెడ్డి, రాజు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిధులతో మల్లాపూర్ అభివృద్ధికి కృషి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మల్లాపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి చొరవతో మల్లాపూర్ డివిజన్ లోని పలు రోడ్డు పనులకోసం సీఎం నిధులతో 60 లక్షల రూపాయలు మంజూరు చేసిన సందర్భంగా శనివారం గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ రానున్న రోజులలో సీఎం నిధులతో మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి మల్లాపూర్ లో అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు బెల్లం శ్రీనివాస్, పీ.జీ సుదర్శన్,జమీలా బేగం,మక్తాల బాలరాజ్ గౌడ్, దంతూరి రాజు గౌడ్, ఎం.శ్రీనివాస్ రెడ్డి,మల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు కప్పరా సాయి గౌడ్, మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జానీ భాయ్, జోష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్,సెక్రటరీ రూపేందర్, ఎస్.వి.కిట్టు, కరుణాకర్ గౌడ్, చారీ, సురేష్, వర్మ, మైనారిటీ అధ్యక్షులు ఫాస్సిద్దీన్,సోనీ గౌడ్, నజ్మా, మహిళా అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ బేగం,వర్కింగ్ ప్రెసిడెంట్ లావణ్య, జాయింట్ సెక్రటరీ ఇజరోతబోను, ఎస్.సి.సెల్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి, అక్కు, హరి, వినేష్, గోవింద్, రఘు, సురేష్, ఇమ్రాన్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు బస్తి వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేసిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా మారిందని అనారోగ్యం ఉన్న ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన బి.వెంకటమ్మ, ఎన్.రాధికలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.51 వేలు, 40 వేల చెక్కులను ఇద్దరికి మాజీ ఎమ్మెల్యేకూన(శ్రీశైలం గౌడ్ తన నివాసంలో అందించారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు భాదిత మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కూన (శ్రీశైలం గౌడ్ ను తన నివాసం వద్ద కలిసి పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయా సమస్యలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వాటి పరిష్కారానికికృషిచేస్తాననివారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, దుగ్యాల సాయిప్రసాద్, రామచంద్ర రెడ్డి, ప్రవీణ్, రంగారావు, నవీన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి,బండిసాయి,నారాయణతదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ఉప్పల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోనూ భారీగా నిధులను రప్పించి అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు. ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాలలో మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.16.63 లక్షల నిధులు మంజూరు చేయించినట్టుగా తెలిపారు. పరమేశ్వర్‌రెడ్డి శనివారం మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి మంచినీరు, డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అతి త్వరలోనే జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పనుల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతు న్నట్టుగా తెలిపారు. చేపట్టే పనులు, మంజూరైన నిధుల వివరాలను ఎండి అశోక్ రెడ్డికి వివరించారు. ఉప్పల్ భగాయత్‌లో రూ.6.81 కోట్లతో మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటు,ఉప్పల్ భగాయత్ ఫేస్-1లో రూ.4 కోట్లతో సీవరేజ్ పైపులైన్ల మరామ్మతులు, రీప్లేస్‌మెంట్లు ఇతర పనులు,ఉప్పల్ డివిజన్‌లో రూ.3.98 కోట్లతో పద్మావతి కాలనీ, ఆనంద్ నగర్ ,సెవెన్‌హిల్స్‌కాలనీ, తదితర కాలనీలలో సీవరేజ్ పైపులైన్ల రీ మోడలింగ్ పనులు, రామంతాపూర్‌లోని ఇందిరానగర్ మెట్లగల్లీ లో రూ.68.80లక్షలతో ఆర్‌సీసీ సీవరేజ్ పైపులైన్ల నిర్మాణం,ఉప్పల్‌లోని స్వరూప్‌నగర్‌లో రూ.60లక్షలతో సీవరేజ్ పైపులైన్ల రీమోడలింగ్ పనులు,రామంతాపూర్ భగాయత్ లో రూ.18.50 లక్షలతో శ్రీ రేణుక ఎల్లమ్మ బంగారు మైసమ్మ ఆలయ ప్రాంతంలో సీవరేజ్ పైపులైన్ నిర్మాణం,రామంతాపూర్ భగాయత్ లో రూ.31 కోట్లతో కేటీఆర్ నగర్‌లో మంచినీరు, సీవరేజ్ పైపులైన్ల నిర్మాణం పనులకు సీఎం నిధులు మంజూరు చేసినట్లు వివరాలను వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కోరారు.

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి, బడంగ్ పేట్ కార్పొరేషన్లలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభించిన ప్రైమరీ హెల్త్ సెంటర్, ఆర్.సి.ఐ రోడ్డు నుండి ఎయిర్పోర్ట్ రోడ్డు విస్తరణ పనులలో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కిచ్చెనగారి లక్ష్మారెడ్డి తో కలిసి పాల్గొన్న పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జల్పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, అచన శ్రీనివాస్, హలీం తదితరులు పాల్గొన్నారు.

-బాలాపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్):

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు, నవంబర్ 30 (నిఘా న్యూస్): డిస్టిక్ స్పోర్ట్స్ అవుట్ డోర్ స్టేడియంలో ని టేబుల్ టెన్నిస్ హాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా టెన్నిస్ ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ పరిచయం చేసుకొని ప్రోత్సహించారు. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ డిసెంబర్ మూడో వారంలో కాకినాడ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహించి అద్భుత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు పథకాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. పోటీలకు జిల్లా నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వారి నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్టు సెలక్షన్ కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, నాగ శేషు తెలిపారు.

గాడాల గ్రామంలో గ్రామసభ

కోరుకొండ, నవంబర్ 30 (నిఘా న్యూస్): కోరుకొండ మండలం గాడాల గ్రామంలో ఆత్మ పథకం ద్వారా కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, మట్టి నమూనాలు సేకరించి భూసార ప్రతలు రైతులకు ఇవ్వడానికి గ్రామసభ నిర్వవించారు. ఈ కార్యక్రమానికి, ఆత్మ పథకం సంచాలకులు జ్యోతిర్మయి అధ్యక్షతన ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ భూమిలో వచ్చే లోపాలను భూసార పరీక్షలు చేయించినపుడు మట్టి నమూనాల సేకరణ తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మల్లికార్జునరావు బీటీఎం జి.రాజశేఖర్ ఎస్ టి ఎల్ ఎస్ సరళ ఏఈవో డేవిడ్ శాంక్షన్, వి ఏ ఏ గుణ వంశీ మరియు కేంద్రీయ టీచర్స్ విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

బాధితుడి చికిత్సకు ఎల్ఓసి అందజేసిన ఈటల



మనోహరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలోని వడ్ల దయానంద చారి తండ్రి బ్రహ్మయ్య, వీరికి ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఎంపీ ఈటల రాజేందర్ ను వేడుకొన్నారు. అనారోగ్యం తీవ్రతరం కావడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆపరేషన్ ఖర్చుల కోసం మల్కాజిగిరి ఎంపీ ఈటల చొరవతో రెండు లక్షల 50 వేల రూపాయల, ఎల్ ఓ సిని వీరి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాళ్ళకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్, కాసం రంజిత్ రెడ్డి, వడ్ల వెంకటచారి, పిట్ల వెంకటేష్, పిట్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మీర్పేట్ లోని మంగాపురం కాలనీకి సంబంధించిన బి.వంశీ అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం అవసరమగు నిధులను ఎల్ఓసి ద్వారా అందజేసిన ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి.

-ఉప్పల్, నవంబర్ 30 (నిఘా న్యూస్):

గీతంలో కేక్ మిక్సింగ్ వేడుకలు

రామచంద్రాపురం, నవంబర్ 30 (నిఘా న్యూస్): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని హాస్పిటాలిటీ (ఆతిథ్య) విభాగం ఆధ్వర్యంలో శనివారం కేక్ మిక్సింగ్ వేడుకను ఉత్సాహభరితంగా నిర్వహించారు. హాస్పిటాలిటీ డిప్యూటీ డైరెక్టర్ అంబికా ఫిలిప్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థులు, పలువురు సిబ్బంది, పాకశాస్త్ర నిపుణులు శాంతాక్రజ్ వేషధారణలో పాల్గొని ముందస్తు క్రిస్మస్ వేడుక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కేక్ మిక్సింగ్ వేడుకలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలువురు చెఫ్‌లు, ఆతిథ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సంప్రదాయంలో పాల్గొనడం వల్ల రాబోయే సంవత్సరంలో అదృష్టం, సంతోషం కలుగుతుందని పలువురు విశ్వసిస్తారు.

యావపూర్ లో పౌరహక్కుల దినోత్సవం

తూప్రాన్, నవంబర్ 30 (నిఘా న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని యావాపూర్ గ్రామంలో సివిల్ రైట్స్ డే ప్రోగ్రాంలో తూప్రాన్ ఆర్ డి ఓ జయచంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పౌర హక్కులు గూర్చి వివరిస్తూ గ్రామస్తులను చైతన్య పరిచారు. ఒకవర్గం, జాతి, అభివృద్ధి చెందాలంటే విద్యా ఒక్కటే మార్గమని అన్నారు. ప్రజలందరు సత్ప్రవర్తనను అలవర్చుకొని, తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు అభ్యసించే విధంగా చొరవ చూపాలని మంచి భవిష్యత్ ను అందించాలని కోరారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.వెంకట రమణ

వికారాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన జిల్లా పరిధిలోని డాక్టర్లకు, క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం నుండి డాక్టర్ మురారి యూనిసెఫ్, డాక్టర్ జోష్న, డాక్టర్ డేవిడ్ శిక్షణ కార్యక్రమానికి పర్యటించి, ఇమ్యునైజేషన్ కార్యక్రమంను అనుసరించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న ఆరోగ్య అంశాలను క్షేత్రస్థాయిలో అమలుపరచాలని వెల్లడించారు. ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు, మండల వైద్యాధికారులు, క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

దివంగత కామేశ్వర రావు 51 వ వర్ధంతి సందర్భంగా శనివారం విద్యుత్తు శాఖ యూనియన్ 1104 నాయకులు పరశురామ్, శివ, బార్నబాస్ 400 మందికి ప్రాణ దాత సేవా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సేవ సమితి చైర్మన్ సునీల్ కుమార్, నారాయణ రెడ్డి, రాజు, సూర్య నారాయణ, ఈశ్వర్ రెడ్డి, న్యాయవాది సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

-ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్):

సహా చట్టంపై ఎచ్చర్ల ఎమ్మార్వో నిర్లక్ష్యం



శ్రీకాకుళం, నవంబరు 30 (నిఘా న్యూస్): కోరిన సమాచారం నిర్దిష్ట కాల పరిమితి 30 రోజుల్లో ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, మొదట అప్పీలు విచారణకు సకాలంలో హాజరు కాని ఎచ్చెర్ల మండల తహశీల్దార్ కార్యాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ దరఖాస్తుదారుడు రాకోటి ఈశ్వర రావు కోరారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు యిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం జరిపి నాయుడుపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్లు 85/10,85/2,107/17 కు సంబంధించి ఎస్.ఎల్.ఆర్., అడంగల్,10(1) పొట్టి అడంగల్, పెయిరడంగల్, ఖాతా నెంబరు 103, సర్టిఫైడ్ కాపీస్, సర్వే నెంబరు 85/10 కు సంబంధించి వెబ్ ల్యాండ్ హెూల్డింగ్ డిటైల్స్, సర్వే నెంబరు 107/17, డీ పట్టా రిజిష్టర్ తదితర వివరాలను ఆర్టీఐ యాక్ట్ 2005,సెక్షన్ 6(1) ప్రకారం అక్టోబరు 09,2024న రాకోటీ ఈశ్వర రావు దరఖాస్తు చేసారు.నిర్దిష్ట కాల పరిమితి 30 రోజుల్లో కోరిన సమాచారం అందించలేదు. దీంతో సెక్షన్ 19(1) ప్రకారం మొదట అప్పీలేట్ అధారిటీ రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకాకుళం వారికి నవంబరు12,2024న దరఖాస్తుదారుడు చేసారు. అప్పీలుపై విచారణకు సంబంధించిన పూర్తి వివరాలతో నవంబరు 30,2024న హాజరు కావాలని లేఖ నెంబరు 1602/2024/జి/ప్రకారం ఆర్డీఓ కార్యాలయం, శ్రీకాకుళం వారు నోటీసు పంపించారు. ఆర్డీఓ ఆదేశాలను కూడా ధిక్కరిస్తూ ఎచ్చెర్ల మండల తహశీల్దార్ కార్యాలయ అధికారులు విచారణకు సకాలంలో హాజరు కాలేదు. ఆర్టీఐ యాక్ట్ 2005 అమలు పట్ల మండల తహశీల్దార్ కార్యాలయాల్లో నెలకొన్న నిర్లక్ష్య వైఖరి మొదట అప్పీలు విచారణకు డుమ్మా కొట్టడంలో అర్థం అవుతుందని దరఖాస్తుదారుడు రాకోటి ఈశ్వర రావు ఆందోళన వ్యక్తం చేశారు. కోరిన సమాచారం ఇప్పించి న్యాయం చేయాలని ఆయన కోరారు. లేకుంటే సమాచార కమిషన్ కు రెండవ అప్పీలు చేస్తానని చెప్పారు.

విశ్రాంత జీవితాన్ని సమాజ సేవలో గడపండి

- **పదవి విరమణ పొందిన పోలీసులకు విజ్ఞప్తి**
- **సిబ్బందిని సన్మానించి**

వీడ్కోలు పలికిన సిపి సివి.ఆనంద్

హైదరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన 12 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపి సివి ఆనంద్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన అధికారులు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత పోలీస్ సిబ్బంది ఆరోగ్యకరమైన సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి వారి కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. పదవి విరమణ తర్వాత కూడా పోలీసులు ఆపారమైన తమ అనుభవాన్ని వృధా కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. రిటైర్‌మెంట్ అనంతరం భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం, కుటుంబంతో సంతోషంగా గడపాలని సిపి ఆకాంక్షించారు. పదవి విరమణ పొందిన పోలీస్ సిబ్బంది పోలీసు శాఖకు అందించిన సేవలు మరవలేనివని సిపి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్ ఛీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యన్.శంకర్ రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బాలికల వసతి గృహంలో పేట ఎస్సై శంకర్ తనిఖీలు

పెద్ద శంకరంపేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, వసతి గృహాన్ని పేట ఎస్సై శంకర్ శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కూరగాయలను సరుకుల నాణ్యతను విద్యార్థుల కోసం వండిన మధ్యన భోజనాన్ని పరిశీలించి కస్తూర్బా గాంధీ హాస్టల్ వార్డెన్ కు సిబ్బందికి కీలక సూచనలు చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ లో కూరగాయలు, గుడ్లను వంటశాలను ఆహార పదార్థాలను, పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ నేలపై ఉంచకుండా స్టీల్ పాత్రలో భద్రపరచాలని వాటిపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని ఆహారం కలుషితం కాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని కస్తూర్బా గాంధీ వార్డెన్ కు విద్యార్థులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాలు నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదని సూచించారు. పాడైపోయిన కూరగాయలతో పాటు కాలం చెల్లిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించకూడదని, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఎస్ ఐ శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సునీత సిబ్బంది పాల్గొన్నారు.

మౌనం వీడండి ఫిర్యాదు చేయండి

బాధిత మహిళలకు సఖి ప్రతినిధులు కవిత చంద్రకళ విజ్ఞప్తి

నారాయణపేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): నారాయణపేట జిల్లా ఉట్కూరు గ్రామంలోని రైతు వేదికలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి ప్రతినిధులు అయిన కవిత, చంద్రకళ మాట్లాడుతూ మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. హింసకు వ్యతిరేకంగా గళం విప్పడం హింస తన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నప్పుడు తనకున్న హక్కుల గురించిన చైతన్యాన్ని అలవర్చుకోవడం చాలా ముఖ్యం. హక్కుల గురించి అవగాహన వచ్చినప్పుడు తన రక్షణ కోసం ప్రభుత్వం తెచ్చిన చట్టాలను ఉపయోగించుకునే ధైర్యం వస్తుంది. ఎలాంటి సహాయ సంస్థలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోగలుగుతారు. ఈ అవగాహన మహిళలందరికీ చాలా అవసరం ఇంట్లో హింస జరిగినప్పుడు గృహింస నిరోధక చట్టం 2005 బాధితులకు రక్షణగా ఉంటుంది. 181 ఉమెన్ హెల్ప్ లైన్ కు ఫోన్ చేసి సఖి సెంటర్ కు రిఫర్ చేయడం ద్వారా ఆమెకు అండగా ఉంటుంది. తెలంగాణలోని అన్ని జిల్లాలలోనూ అందుబాటులో ఉన్న సఖి సెంటర్లు బాధిత మహిళలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఇవ్వడానికి ఏర్పాటై ఉన్నాయి. అందుకే మహిళలందరికీ 181 హెల్ప్ లైన్ నెంబర్ గురించి తెలియాలి ఈ నెంబర్ కి కాల్ చేస్తే తెలంగాణలోని అన్ని జిల్లాలకు సఖి సెంటర్లు అందుబాటులో వస్తాయన్న విషయం వారికి తెలియ చెప్పాలి. గృహహింసను మౌనంగా భరించకుండా 181 ఫోన్ చేసి తమ జిల్లాలోని సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలి. మౌనం వీడండి భయపడకండి ఫిర్యాదు చేయండి. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు గీత, అంజమ్మ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా..

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా పబ్బోజు

రామంతపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): హైదరాబాద్ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు గా పబ్బోజు బిక్షపతి చారి నియామకాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఖరారు చేసింది.త్వరలోనే హైదరాబాద్ లో పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించాలని, అనంతరం హైదరాబాద్ జిల్లా లోని అన్ని డివిజన్లలో సంఘాలను బలోపేతం చేస్తూ జిల్లా సదస్సు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం నూతన అధ్యక్షుడిగా ఖరారైన పబ్బోజు బిక్షపతి చారికి సూచనలు సలహాలు అందచేసింది. ఈ సందర్భంగా తన నియామకాన్ని ఖరారు చేసిన రాష్ట్ర సంఘం అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్, రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ లాలుకోట వెంకటాచారి ఆశీస్సులు తీసుకున్నారు ఈ సందర్భంగా పబ్బోజు బిక్షపతి చారి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ దాయి బేధం లేకుండా జాతి అభిమానంతో పంచదాయ వృత్తుల వికాసం, అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పబ్బోజు బిక్షపతి చారి ని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షులు పులిగిళ్ళ శ్రీనివాసా చారి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు నారోజు జగ్జీవన్ చారి, రంగారెడ్డి జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ద కొలిమి బ్రహ్మచారి, రాష్ట్ర కమిటీ కార్యదర్శి డాక్టర్ మారేడుపాక రమేష్, రామంతాపూర్ శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమీటి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పబ్బోజు బిక్షపతి చారికి అభినందనలు తెలిపారు.

అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కావేరి హెూమ్స్ కాలనీలో తుమ్మల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

-అమీన్ పూర్ నవంబర్ 30 (నిఘా న్యూస్):

సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షుడు డా.చందర్ కు సన్మానం

సిద్దిపేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మారుమూల గిరిజన సేవాలాల్ తండాలో జన్మించి ఎంతో కష్టపడి వైద్యం చదువుకొని వైద్యవృత్తిలో గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. సిద్ధిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తూ పేద ప్రజలకు అండదండగా నిలిచిన భూక్య చందర్ నాయక్ సిద్దిపేట జిల్లా ఐ ఎం ఏ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. వైద్య వృత్తిలో అంచలంచెలుగా ఎదుగుతూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్న డాక్టర్ చందర్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా సిద్దిపేటలోని డాక్టర్ చందర్ నాయక్ స్వగృహములో ముస్తాబాద్ మండల నాయకులు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెద్దిగారి శ్రీనివాస్,ఓరగంటి తిరుపతి ముస్తాబాద్ మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగిన వీధి దీపాలు

నిజాంపేట్, నవంబర్ 30 (నిఘా న్యూస్): సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామం మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు వెళ్లే దారిలో వీధి దీపాలు లేక పోవడంతో విద్యార్థుల ఉపాధ్యాయుల కోరిక మేరకు నారాయణఖేడ్ శాసనసభ్యులు డా.పట్లోల సంజీవరెడ్డి ఆదేశాలతో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ స్తంభాలను వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది దీనికి విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో హెచ్ఐవి వైద్య శిబిరం

అంబర్ పేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్ బేతేల్ గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్-డే సందర్భంగా శనివారం హెచ్ఐవి మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, నిరీక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుజయ్, బేతే ల్ గాస్పెల్ చర్చి బిషప్ డాక్టర్.కె.సుధాకర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ క్యాంపులో పంచాయతీ రాజ్ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బేతేల్ గాస్పెల్ చర్చిసేవలను కొనియాడారు. ఈ క్యాంపులో దాదాపు 360 హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, న్యూట్రిషన్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గో ఇండియా డైరెక్టర్ కిరణ్ పాల్, శారా క్రిసోలైట్, సోషల్ వర్కర్లు బి.నరసింహ, ఏ.వెంకటేశ్, మెగా, అశ్విని, రోజి,సోని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన తో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం

సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్



తాండూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): స్వయం పరిపాలన దినోత్సవం లో విద్యార్థులే ఒక్క రోజుకు ఉపాధ్యాయులు కావడంతో వారిలో నూతన ఉత్సాహం కనిపించిందని సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ వెల్లడించారు. బషీరాబాద్ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.డి.షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ హాజరై సమావేశంలో మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉపాధ్యాయులై తమకు కేటాయించినతరగతిగదులకువెళ్ళితోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తుంటే చూపరులకు కనువిందుగా కనిపించిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం

- విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని డిమాండ్
- ఎస్ఎఫ్ఐ మండల నాయకులు స్వాతి, పుష్పాల చరణ్ డిమాండ్

అశ్వారావుపేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి మోను చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కీసర్ స్వాతి, పుష్పాల చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వ పాఠశాలల బంద్ లో భాగంగా శనివారం మండల పరిధిలోని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ములకలపల్లి, పూసుగూడెం, జగన్నాధపురం, మాధరం, మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బంద్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతి, చరణ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులు, కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం మధ్యాహ్న భోజనం వల్ల ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు పిట్టలా రాలిపోతుంటే ప్రభుత్వానికి కనికరం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. నాణ్యత లేని భోజనం వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సరైంది కాదని పాఠశాలలలో పౌష్టికాహారం ప్రభుత్వం అందించక పోవడంతో విద్యార్థులకు రక్తహీనత లోపం ఏర్పడుతుందని విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న నేటికీ రాష్ట్రంలో ముఖ్యమైన శాఖ విద్యాశాఖ అటువంటి విద్యాశాఖకు నేటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సరైంది కాదని వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించి విద్యాశాఖపై రివ్యూ జరిపి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు నిధులు కేటాయించి ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించని యెడల భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్కే సోహిల్, కారం గౌతమ్,వెలకం నందిని, సంజయ్, నరాటి అభి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ విమలకు ఘన సన్మానం

మోత్కూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్ గా నూనెముంతల విమల గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ విమల గౌడ్ దంపతులను మాజీ జెడ్పీటీసీ కొలుకొండ యాదగిరి, హజ్ కమిటీ సభ్యుడు షర్ఫుద్దీన్, దశరథను మార్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం విమల గౌడ్ మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి అధ్యక్షుడు అందెం సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరి గౌడ్ కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుండి ప్రజాపాలన విజయోత్సవాలు

బాలాపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): డిసెంబర్ ఒకటి నుండి 9వ తేది వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహి స్తున్నట్లుగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ సరస్వతి తెలిపారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు అధికారులకు ప్రజాపాలన విజయోత్సవాలలో పాల్గొనాలని తెలియజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ప్రతి వార్డులో చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ప్రత్యేకంగా నియమించిన సూపర్వైజర్లు, వార్డు అధికారులు ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. ప్రజాపాలన విజయోత్సవాలు నియమించిన అధికారులకు ఎటువంటి సెలవులు, మంజూరు చేయబడవని, కార్యక్రమాలలో భాగంగా వార్డులలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడానికి అధికారులను నియమించినట్లుగా తెలిపారు.

నరసింహ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రెషర్స్ డే

మేడ్చల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడ లోని నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో లె– పిస్టా పేరుతో ఎంబీఏ విద్యార్థులు ప్రెషర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే కృషి పట్టుదల తప్పక ఉండాలని, అవి మన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ ఏ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి దశలోని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నరసింహారెడ్డి, కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, డైరెక్టర్ ఏ మోహన్, ప్రిన్సిపల్ లోకనాథం వైస్ ప్రిన్సిపల్ పురుషోత్తం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి ఉద్యమాలతో హక్కులు సాధించుకోవాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు

మధిర, నవంబర్ 30 (నిఘా న్యూస్): కార్మికులు సమిష్టి ఉద్యమాలు, పోరాటాలతో తమ హక్కులను కాపాడు కోవాలని, అందుకు కార్మికులను, చైతన్యవంతం చేసే భాధ్యత సిపిఐ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు కోరారు. ఇటీవల మధిర–పరిసర గ్రామాల్లో లో ఇసుక తోలకాలు నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మిక వర్గం కుదేలైపోయింది. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి స్పందించిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఈనెల 28న కార్మికుల పొట్ట కొట్టొద్దని పత్రికలకు ఇచ్చిన స్టేట్మెంట్ కి స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి ఆయన చూసిన మేరకు రెవెన్యూ మైనింగ్ అధికారులు ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తామని ప్రకటన చేశారు. దీంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి భవన నిర్మాణ కార్మికులు, బెజవాడ రవిబాబు ధన్యవాదాలు తెలిపారు.

బాల మల్లేష్ మృతి పట్ల సిపిఐ సంతాపం

ఖమ్మం, నవంబర్ 30 (నిఘా న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ ఖమ్మంజిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తీవ్ర – సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమల్లేష్ నాకు విద్యార్థి దశ నుంచి మిత్రుడని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యదర్శి, దివంగత పోటు ప్రసాద్ అంత్యక్రియల్లో బాలమల్లేష్ పాల్గొన్నారని సంతాప సభలో మాట్లాడారని హేమంతరావు గుర్తు చేసుకున్నారు. అంతిమ యాత్రలో సిపిఐ కార్యాలయం నుండి మమత ఆసుపత్రి వరకు నడిచారని ఆయన తెలిపారు. గుండె పోటు బాలమల్లేష్ ప్రాణాలను బలిగొన్నదని కమ్యూనిస్టు ఉద్యమం బాలమల్లేష్ మృతితో నిబద్ధత గల నాయకున్ని కోల్పోయిందన్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ –మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఎస్కి జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,సిద్దినేని కర్ణకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు,తాటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వర్గీకరణ మాదిగల విజయం కాదు మనువాదుల కుట్ర

- నేటి మాలల సింహగర్జనను విజయవంతం చేయండి
- ఉప్పల్ నియోజకవర్గ మాలల సింహగర్జన సభ ఇన్ చార్జి మాస శేఖర్

ఉప్పల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని ఉప్పల్ నియోజకవర్గం మాలల సింహ గర్జన సభ ఇన్చార్జ్ మాస శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాట్లాడుతూ మాల బిడ్డలు కుటుంబ సభ్యులు అందరూ ఒక శక్తి లా కదలి రావాలని ఈ సభని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ మనువాదులు ఆడుతున్న నాటకంలో మాదిగలు పావులుగా మారారని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల విజయం కాదని మనువాదుల కుట్రగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో మాలలు అతి పెద్ద రెండో సామాజిక వర్గమని తెలిపారు. అసత్య ఆరోపణలతో మాలల అస్తిత్వాన్ని దెబ్బతీయలేరని హెచ్చరించారు. నవంబర్ 1న జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకై సామాజిక ఉద్యమాలు నిర్మిస్తామని చెప్పారు. మాలలు ఆత్మగౌరవానికి ప్రతీక అని వివరించారు.

మురికి నీటి కాలువలను సైతం వదలని కబ్జాదారులు

బెల్లంకొండ, నవంబర్ 30 (నిఘా న్యూస్): అసలే వర్షాలు ఆపై వ్యాధుల కాలం అందుకు పారిశుద్ధ్యం లోపాలే కారణమవుతున్నాయి. డ్రెయిన్ లలో మురుగు పారుదల సక్రమంగా ఉంటే వ్యాధులు తలెత్తే అవకాశం తక్కువ.డ్రెయిన్లు ఆక్రమణకు గురి కావడంతో రోజువారి పారిశుధ్య నిర్వహణకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. మండల కేంద్రంలో ఇలాంటి పరిస్థితి స్థానికులకు ఆందోళనకు గురిచేస్తుంది. పంచాయితీ అధికారులు పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అక్రమాణల పర్వం యదేచ్చగా సాగుతుంది. గ్రామంలో పలు విధుల నుండి ప్రధాన రహదారికి మురుగునీరు డ్రెయినేజీ ద్వారా చేరుతుంది. డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉంటే పారుదల సక్రమంగా సాగే అవకాశం ఉంటుంది.కాగా రహదారికు ఒకవైపు డ్రెయిన్ ఆక్రమాల పాలవడంతో పారిశుద్ధ్య నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుంది. కాలువపై ఆక్రమణదారులు మెట్లు,సగం గది కాల్వ పై ఉండటంతో పారిశుద్ధ్య నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతుంది. కాలువల్లో పెద్ద మొత్తంలో వ్యర్థాలు నిలిచి మురుగు పారుదలపై ప్రభావాన్ని చూపి దోమలు వృద్ధి చెందుతున్నాయి.తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా పారిశుద్ధ్యం,ఆరోగ్య, పంచాయితీ పాలకులు అధికారులు సమన్వయంతో ఆక్రమణను అరికట్టి వ్యాధుల బారి నుంచి విముక్తి కలిగించాల్సిందిగా గ్రామ ప్రజలు కోరారు.

పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

నిజాంపేట్, నవంబర్ 30 (నిఘా న్యూస్): సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారి జాన్సన్. తహసిల్దార్ ఆదేశాల మేరకు పాఠశాలను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాల గది, బియ్యం నిల్వ ఉండే స్టోర్ రూమ్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల లో మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి భోజనం చేశారు. ముఖ్యంగా పిల్లల హాస్టల్ లో ఉండే పిల్లలకు నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన నీరు అందించాలి విద్యార్థులకు వైద్య పరీక్షల నిమిత్తం వైద్య సహాయం అందించాలి. అలాగే హాస్టల్ ఉండే పిల్లలకు చలి తీవ్రత ఎక్కువ ఉంది, కాబట్టి బ్లాంకెట్ ఆహారం నాణ్యమైంది అందించాలి. మురికి నీరు నిల్వ ఉండకుంట చర్యలు తీసుకోవాలని వాడెన్ కు తెలియజేశారు. అలాగే విద్యార్థుల చదువుతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలి క్రీడల ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి శారీరకంగా దృఢంగా పోటీ ప్రపంచంలో శక్తి వంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం పౌర్ణమి నాడు అన్నదానం

చల్లా సేవా నిరతిపై ప్రజల ప్రశంసలు

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): టిడిపి బీసీ నాయకులు, కృష్ణాలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సందర్భంగా మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు 1000 మంది పాల్గొని చల్లా రాజగోపాల్ యాదవ్ సేవా నిరతిని ప్రశంసించారు. ప్రతి రోజు ప్రొద్దుటూరు పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శనివారం, పౌర్ణమి రోజు ఎంతమంది వచ్చినా ఆయన సేవాతత్పరతతో అన్నదానం చేయడం ఆనందకరమన్నారు. పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా ఆయన అందరికీ భోజనాలు పెడుతూ పేదల గుండెల్లో ఆయన సుస్థిర స్థానం పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు చింతల రాఘవేంద్ర యాదవ్ మూరబోయిన శ్రీనివాస్ యాదవ్ టైలర్ ప్రసాద్ సీతంపల్లి రమణ బంగి శివప్రసాద్ నేలటూరు సంజీవరాయుడు యాదవ్ దస్తగిరి టైలర్ ఏసు నాథ్ రెడ్డి దస్తగిరి ఆర్ఎంపీ డాక్టర్ డ్రైవర్ భాష నల్లం రవిశంకర్ హరీష్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్కిటెక్చర్ సంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): స్థానిక కొర్రపాడు రోడ్డు లో ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా వున్న సన్ షైన్ కౌంటీ రూం నంబర్ 24లో ఏర్పాటు చేసిన ఏపీ ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్స్ సంస్థను శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా ప్రొద్దుటూరు వాసులకు వినూత్న ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ అందుబాటు ధరలలో అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు సునీల్, రాంప్రసాద్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ విభాగంలో తమకు ఆరు సంవత్సరాల అనుభవం వుందన్నారు. ప్రొద్దుటూరు వాసులకు వినూత్న డిజైన్లు పరిచయం చేయాలనే సద్దుద్దేశ్యంతోనే ఈ సంస్థ ప్రారంభించామని వివరించారు. హైదరాబాద్ లో వున్న తమ సంస్థ అనుబంధ కర్మాగారం నుండి ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమయ్యే ఇంటీరియర్ డిజైన్స్ ను తక్కువ ధరలకే అందిస్తామని వివరించారు.

పోతుగల్ ఎస్సి బాలుర హాస్టల్ తనిఖీ

పరిశీలించిన ఎంఈఓ రాజరెడ్డి

ముస్తాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ఎస్సి బాలుర వసతిగృహంలో మండల విద్యాధికారి నిమ్మ రాజి రెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వంట గది కూరగాయల నాణ్యతను బోజన సరుకులను పరిశీలించినారు. భోజనం సరిగా పెడుతున్నారా ఎలా ఉంటుందని, చలి ఎక్కువగా ఉన్నందున బెడ్ షీట్లు, దుప్పట్లు సరి పడ ఉన్నాయా లేదా అని పలు పలు విషయాలపై విద్యార్థులను ఎంఈఓ రాజిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి భోజనం చేశారు. జిల్లా విద్యా శాఖ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా సంస్థల్లో ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమాలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న షెడ్యూల్లో భాగంగా మండలంలోని విద్యార్థులకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నందు వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని ఎంఈఓ పేర్కొన్నారు.

గురజాడ చిత్రపటానికి ఐద్వా నివాళులు

ఎలమంచిలి, నవంబర్ 30 (నిఘా న్యూస్): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా ఐద్వా ఆధ్వర్యంలో అచ్యుతాపురం కైట్స్ ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు 109వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఐద్వా అచ్యుతాపురం మండలం కన్వీనర్ వరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు మంగతాయారు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురజాడ రచనలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు.

అభ్యాస పాఠశాలలో పింక్ కలర్ డే

వరంగల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): వరంగల్ నగరంలోని రంగ సాయి పేట గణేష్ నగర్ లో గల అభ్యాస స్కూల్ లో స్కూల్ కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ ఆధ్వర్యంలో చిన్నారులను ఉత్తేజ పరచే అద్భుతమైన పింక్ కలర్ డే ను ప్రారంభించి చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ రంగుల చిత్రం ఒక్కొక్క రంగు ఒక్కొక్క దానికి ప్రత్యేకం అని ఇంద్రధనుస్సులో ఉన్న అన్ని రంగులూ చూస్తే మనసుకు ఉల్లాసం ఉత్సాహం కలుగుతుందని శనివారం చిన్నారుల పింక్ కలర్ డే ను చూస్తే చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిన్నారులు ప్రదర్శించిన పింక్ కలర్ దుస్తులు ఆకర్షణీయంగా ఉన్నాయని అన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మండల శిరీష ప్రియాంక రజినీ భారతి టీచర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

11 నెలల్లో.. 52 మంది విద్యార్థుల మృతి

- విద్యార్థులకు నాణ్యమైన అన్నం పెట్టమంటే అరెస్టు చేస్తారా
- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు, నవంబర్ 30 (నిఘా న్యూస్): గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన అన్నం పెట్టమంటే అరెస్టు చేస్తారా అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ బయలు దేరగా పోలీసులు మార్గమధ్యంలోనే అరెస్టు చేసి రామడుగు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. 11 నెలల్లో 52 మంది

విద్యార్థుల మరణించారని, ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగాయని తెలిపారు. పాలన గాలి కొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పొట్టన బెట్టుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేరని, ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని దుయ్యబట్టారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు అన్ని రకాల గురుకుల విద్యాసంస్థలు కలిపి 291 ఉంటే వాటిల్లో కేవలం లక్ష 54 వేల మంది చెదివేవారని, కేసీఆర్ పాలనలో స్వరాష్ట్రంలో 1022 గురుకులాలు ఏర్పాటు చేసుకుని ఆరు లక్షల10 వేల 810 మంది విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య, భోజనం అందిచడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా అన్ని గురుకులాలను కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకొని, కేవలం గిరిజన గురుకులాలు గతంలో 91 మాత్రమే ఉంటే అదనంగా మరో 97 గురుకులను ఏర్పాటు చేసుకుని 91,370 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యాభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగేవని, గురుకులాల్లో సీట్ల పొందడం కోసం విద్యార్థులు పోటీ పడేవారని పేర్కొన్నారు. ఎలా ఉండే విద్యవ్యవస్థ ఎలా తయారు అయిందని ప్రభుత్వాన్న విమర్శలు గుప్పించారు.

కొప్పులను అడ్డుకున్న పోలీసులు

గురుకుల పాఠశాలను సందర్శించే క్రమంలో ఘటన

ధర్మపురి, నవంబర్ 30 (నిఘా న్యూస్): ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శనకు వెళ్లగా మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ధర్మారం మండలం బిఆర్ఎస్ నాయకులు మల్లాపూర్ గురుకుల పాఠశాలకు చేరుకొని లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారు. టిఆర్ఎస్ నాయకులు లోపలికి వెళ్ళనీయకపోవడంతో గురుకుల పాఠశాల ముందు అర్ధతరిపై బైఠాయించి నిరసన తెలిపారు. వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ధర్నాను భగ్నం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచురి శ్రీధర్ మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు విద్యావ్యవస్థ బాగుండాలని ప్రతి

నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్య వ్యవస్థను విధ్వంసం చేస్తుందని ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండించారు. పదకొండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యశాఖ మంత్రిని నియమించక పోవడం దారుణం అన్నారు. గురుకుల పాఠశాలలో 52 మంది విద్యార్థులు వరుసగా ఫుడ్ పాయిజన్ తో మరణిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు విద్యార్థుల కుటుంబాలను పరామర్శించలేదని,కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్బంధంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మేడారం చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు పూస్కురి జితేందర్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుర్రం మోహన్ రెడ్డి,కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ రైతు బంధు సమితి మండల కన్వీనర్ పాకల రాజయ్య, మాజీ ఎంపిటిసిలు మిట్ట తిరుపతి దాడి సదయ్య,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ అనుబంధ శాఖ అధ్యక్షులు దేవి నవనీకాంత్ అజ్మీర మల్లేష్ నాయక్,నీలం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి సహకారం

ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి

కర్నూల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ మహిళల విభాగంలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని నిత్యం క్రీడలు సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఉత్సాహం పెరుగుతుందన్నారు. క్రీడా ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. రాష్ట్రంలో షూటింగ్ బాల్ క్రీడను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న పరుశ రాముడిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా సీనియర్ మహిళల షూటింగ్ బాల్ పోటీలలో విజేతగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళల జూనియర్ కళాశాల (పత్తికొండ) ద్వితీయ స్థానంలో బాల భారతి (ఓర్వకల్) తృతీయ స్థానంలో గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

(కర్నూలు) జట్లు నిలిచాయని జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, కిరణ్ కుమార్ సుభాన్ భాష, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ యాదవ్

డోర్నకల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎనిమిది సంవత్సరాల పాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో, కార్యదర్శిగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు బీఆర్ఎస్ నేతగా అవతారం ఎత్తి, గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వెనుకాల కుట్ర చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనం చేయాలని చూస్తున్నారని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, మండిపడ్డారు. శనివారం డోర్నకల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం హాస్టల్లో గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ వెనుకాల ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పెంచిపోయేసించిన వ్యక్తుల ప్రమేయం ఉందని చెప్పారు. హాస్టల్లో గురుకులల్లో ఏవైనా ఫుడ్ పాయిజన్ జరిగిన ప్రతిసారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరులు ఒకరు ముందుగానే అక్కడ ఉంటున్నారని అందుకు

సంబంధించిన ఆధారాలు ప్రభుత్వ సేకరిస్తుందని పేర్కొన్నారు. హాస్టల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ వెనక మొదటి ముద్దాయి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాబట్టి అవినీతి నిర్లక్ష్యం ఒప్పుకొని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటన ప్రోత్సహిస్తే చెప్పు దెబ్బలతో సమాధానం చెపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంగుడోత్ వీరన్న, డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్,మదా శ్రీనివాస్, హరికృష్ణ, దాసరి నాని యాదవ్, మల్లయ్యకుంట తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లిఖార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అశ్వారావుపేట సీపీఐ పార్టీ ఆఫీస్ సయ్యద్ మియాజానీ భవన్ లో జరిగిన పట్టణ ఏఐటీయూసీ ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను కార్పొరేట్ బహుళ జాతి ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేయాలని చేస్తున్న ప్రయత్నాలను పోరాటాల ద్వారా తిప్పి కొడతామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముప్పై లక్షల మంది భావన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కాపాడుకుంటూ మరిన్ని సంక్షేమ పథకాలను సాధించటానికి నిర్మాణ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలలుగా సంక్షేమ బోర్డు పథకాలకు ధరకాస్తు చేయనీయకుండ మీసేవ పోర్టల్ ఆన్లైన్ బంద్ చేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ

వ్యాప్తంగా ఉన్న భావన నిర్మాణ కార్మికులను ఏకం చేసేందుకు,కార్మికులను పోరాటాలకు సిద్ధం చేసేందుకు డిసెంబర్ 4,5 తేదీలలో చ్చంద్ర రాజేశ్వరరావు భావన పాల్వంచ నందు జరిగే భావన నిర్మాణ కార్మికుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు జలాల్,దోమల అనిల్,అబ్బాస్,జక్కం బలరాం, ఎస్ కె రిజ్వానా,విజయ్ కాంత్ పాల్గొన్నారు.

మహిళా కౌన్సిలర్ పట్ల టిడిపి తీరు బాధాకరం

మున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి కౌన్సిల్ సమావేశంలో ప్రవర్తించిన తీరు బాధాకరమని మున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి అన్నారు. శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశంలో టిడ్కో ఇళ్ల విషయమై టిడిపి, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా, ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, చింతకుంట ఖాజా మోహిద్దీన్ సహా వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ నుండి వాకౌట్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్ లో ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మహిళా కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మిదేవి దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. సభలో కౌన్సిలర్లు ఇతర కౌన్సిలర్ల పట్ల గౌరవ భావంతో వుండాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర

మల్లాపూర్, నవంబర్ 30 (నిఘా న్యూస్): మల్లాపూర్ ఓల్డ్ విలేజ్ పరిధిలో పలు బస్తిలలో రోడ్ల నిర్మాణం కోసం 60లక్షల రూపాయిల నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి మల్లాపూర్ 5వ కాంగ్రెస్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో పీర్ల కొట్టం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. బస్తి లలో స్వీట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్, వైస్ ప్రెసిడెంట్ జానీ భాయ్, జోష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్,సెక్రటరీ రూపేందర్, మహిళా అధ్యక్షులు శైలజ, జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ బేగం,వర్కింగ్ ప్రెసిడెంట్ లావణ్య, జాయింట్ సెక్రటరీ ఇజరోతబోను,మైనారిటీ అధ్యక్షులు ఫాస్సిద్దీన్, ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు దంటూరి రాజు, పీజీ సుదర్శన్,నెమలి అనిల్, బెల్లం శ్రీనివాస్, జమీల బేగం, మాక్టల బాలరాజు, ఎస్.వి.కిట్టు, కరుణాకర్ గౌడ్, చారీ, సురేష్, వర్మ, మహిళా నాయకురాలు సోనీ, నిజమా, యూత్ కాంగ్రెస్ నాయకులు గడ్డం వినేష్ కాంగ్రెస్ పార్టీ నాయకుల, బస్తి వాసులు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్న కొండకు పోటెత్తిన భక్తులు

గోకవరం, నవంబర్ 30 (నిఘా న్యూస్): కార్తీక మాసంలో ఆఖరి శనివారం కావడంతో గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున మేలుకొలుపు, శ్రీ స్వామి వారికి సహస్రనామార్చన విశేషాలంకారంతో స్వామివారి దర్శనం అనంతరం శ్రీ స్వామివారి పల్లకి సేవ, పంచహారతుల కార్యక్రమం జరిగినది. స్వామివారి సన్నిధిని కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు 10వేల మంది భక్తులు దర్శించుకోవడం జరిగినది. శ్రీ స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన దర్శనానికి స్వామివారి మెట్ల మార్గంలో భక్తులు పసుపు కుంకుమ రాసుకుంటూ స్వామివారి దర్శనానికి విచ్చేయడం జరిగింది. అధిక సంఖ్యలో శ్రీ స్వామివారికి తలనీలాలు సమర్పించడం జరిగింది. వచ్చిన భక్తులందరికీ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, ఆలయ కార్య నిర్వహణ అధికారి వడ్డాది సత్యనారాయణ భక్తులకు కొండపై ఏలోటు లేకుండా సదుపాయాలను కల్పించారు.

భూషణ మెమోరియల్ చర్చి ఆధ్వర్యంలో దేవుని నక్షత్రం

గోకవరం, నవంబర్ 30 (నిఘా న్యూస్): తానా సెంటర్ సమీపంలో ఉన్న అరవపేట కాలనీలో భూషణ మెమోరియల్ చర్చి సహోదర సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా ఏసుప్రభు జన్మించాడని జ్ఞానులకు తెలిపిన నక్షత్రాన్ని దేశమంతటా ప్రతి ఇంటి వద్ద క్రైస్తవులు క్రిస్మస్ నెల ప్రారంభం అయితే చాలు ఈ నక్షత్రాన్ని పెట్టుకుంటారు. డిసెంబర్ నెలలో ప్రారంభించి జనవరి నెల వరకు క్రైస్తవులంతా తమ ఇళ్ల వద్ద నక్షత్రాన్ని పలు రకాల విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి పెట్టుకుంటారు. ఈ సందర్భంగా చర్చి దైవ జనులు మాట్లాడుతూ నెల రోజులు పాటు క్రిస్మస్ వేడుకలను అన్ని చర్చిల వద్ద ఎంతో ఘనంగా జరుపుకుంటామని, క్రైస్తవులకు అతి పవిత్రమైనది క్రిస్మస్ పండుగని తెలిపారు.

తాటివనం బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు

రామడుగు, నవంబర్ 30 (నిఘా న్యూస్): రామడుగు మండల కేంద్రం నుండి తాటి వనం నుంచి షానగర్ వెళ్లడానికి ఉన్న కాజ్ వే బ్రిడ్జి గత వర్షాకాలం తీవ్ర వరదలు వచ్చి కూలిపోయింది. దీంతో తాటివనానికి వెళ్లే గౌడ కులస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం కాజ్ వే పై దెబ్బతిన్నచోట మొరం పోయించి రవాణాకు వీలుగా తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యే సత్యంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరివేని తిరుమల తిరుపతి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, తాజా మాజీ ఉప సర్పంచ్ వడ్లూరి రాజేందర్, తాజా మాజీ వైస్ ఎంపీపీ పురెళ్ళ గోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్ణ శ్రీనివాస్,పొన్నం మల్లేశం, గౌడ సంఘం అధ్యక్షుడు గోనేపల్లి రాజయ్య, డైరెక్టర్లు గుర్రం శ్రీకాంత్ గౌడ్, పూరెళ్ల మనోజ్ కుమార్, పూరెల్ల శ్రీకాంత్ గౌడ్, గోనేపెల్లి పర్శరాములు,పూరెల్ల తిరుపతి, అనుపురం రాజయ్య సభ్యులు అనుపురం తిరుపతి, పూరెళ్ళ ఆంజనేయులు, పూరేళ్ల శేఖర్,అనుపురం వెంకటేష్,అనుపురం రాజేశం, బత్తిని లక్ష్మణ్, విజయ్, గ్రామస్తులు జెట్టిపల్లి వీరయ్య, ఉత్తెం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా కాల్పుల్లో.. ఖమ్మం విద్యార్థి మృతి పట్ల ఎంపీ సంతాపం

ముఖ్యమంత్రికి లేఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో వాకబు చేసిన లోక్ సభ సభ్యులు

ఖమ్మం, నవంబర్ 30 (నిఘా న్యూస్): అమెరికాలో తుపాకీ తూటాలకు ఖమ్మం జిల్లా విద్యార్థి బలి అవడం పట్ల ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేటకు చెందిన నూకారపు కోటేశ్వరరావు కుమారుడైన నూకారపు సాయి తేజ భారత కాలమాన ప్రకారం శనివారం తెల్లవారుజామున దుండగుల కాల్పుల్లో మృతి చెందిన దుర్ఘటన తెలుసుకొని తీవ్ర సంతాపం ప్రకటించారు. నగరంలోని రాపర్తి నగర్ లో నివాసం ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ద్వారా ఫోన్లో విద్యార్థి తండ్రి నూకారపు కోటేశ్వర రావుతో ఎంపీ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంఎస్ చదివేందుకు నాలుగు నెలల కిందటే అమెరికా వెళ్లాడని ఇప్పుడు ఇంతటి ఘోరం జరిగిందని అతను కన్నీరు మున్నీరవగా ధైర్యంగా ఉండాలంటూ ఎంపీ ఓదార్చారు. మృతుడి కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమెరికాలో ఉన్న సాయి తేజ మృతదేహాన్ని మన దేశానికి త్వరగా రప్పించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని లోక్ సభ సభ్యులు రఘురాం రెడ్డి అభయమిచ్చారు. అలాగే విదేశీ మంత్రిత్వ శాఖతో మాట్లాడినట్లు ఎంపీ తెలిపారు.

మహబూబ్ నగర్‌లోని అమిస్తాపూర్ లో జరుగుతున్న రైతు పండుగ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ నిధులను విడుదల చేశారు. రూ.2,747.67 కోట్ల చెక్ ను రేవంత్ విడుదల చేశారు. ఈ రైతు పండగ సదస్సులో సీఎం రేవంత్, ఇతర మంత్రులు పాల్గొన్నారు.

-మహబూబ్ నగర్, నవంబర్ 30 (నిఘా న్యూస్):

నేతల కను సన్నల్లోనే కబ్జాలు

హైదరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): హైడ్రా చీఫ్ రంగనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సంపన్నులే ఎక్కువగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారని అన్నారు. ఆక్రమణకు గురైన స్థలాల్లో పేదల కంటే ఎక్కువగా ధనికులే ఉన్నారని ఆయన వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీల లీడర్లు అందులో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎవరినీ వదిలిపెట్టమని స్పష్టం చేశారు. హైడ్రాకు ప్రభుత్వ సహకారం ఉందని తెలిపారు.

సిపిఐ నేత బాలమల్లేష్ గుండె పోటుతో మృతి

యాప్రాల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యార్థి ఉద్యమం నుండి మొదలైన రాజకీయ ప్రస్థానం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యదర్శిగా, అఖిల భారత రైతుసంఘం ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అంచెలంచెలుగా ఎదిగి గుండె పోటుతో హఠాన్మరణం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూపోరాటంలో కీలక పాత్ర వహించిన ఎన్.బాలమల్లేష్. దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాల్లో చెరగని ముద్ర వేసిన బాలమల్లేష్ కు ఓ కొడుకు, కుమార్తె, యప్రాల్ లో నివాసం ఉంటున్నారు. యాప్రాల్ లో అలుముకున్న విషాద ఛాయలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్.బాల మల్లేష్ అందరికీ సుపరిచితుడే.

కామ్రేడ్ బాల మల్లేష్ కు కూనంనేని నివాళి

హైదరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎన్. బాలమల్లేష్ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్ రెడ్ గార్డుగా పనిచేసి అంచలంచలుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎదిగినాడు. పార్టీలో ఏఐఎస్ఎఫ్ నాయకుడుగా ఆ తర్వాత పార్టీలో వివిధ పదవుల నుండి జీవితం మొత్తాన్ని పార్టీకే అంకితం చేసిండు బాల మల్లేష్. ఆయన మామ ఏఆర్ దేవరాజ్ పార్టీలో రాష్ట్ర నాయకుడిగా పని చేశాడు. రంగారెడ్డి జిల్లాలో పార్టీకి కొంత సంక్షోభం వచ్చిన కాలంలో జిల్లా పార్టీని నిలబెట్టడానికి తక్కువ వయసులోనే కృషి చేశాడు. పార్టీలో ఏ పని అప్పజెప్పినా వీర సైనికుడిగా పనిని స్వీకరించి పూర్తి చేసేవాడు. ఇటీవలనే సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. హనుమకొండలో జరిగిన రాష్ట్ర నిర్మాణ సమితి సమావేశంలో సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బి కే ఏం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బీసీ హక్కుల సాధన సమితికి ప్రధాన కార్యదర్శిగా బాల మల్లేష్ పనిచేస్తున్నాడు. అన్ని వామపక్ష పార్టీలను, మేధావులను, సామాజిక కార్యకర్తలను సమన్వయం చేసే విషయంలో అలుపెరగకుండా అందరి తలలో నాలుకలాగా ఉండేవాడు. మేడ్చల్ జిల్లా, వికారాబాద్ జిల్లాలకు పార్టీ నుండి నిర్మాణ బాధ్యుడిగా కూడా ఉన్నాడు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాదు అంతిమ యాత్రలో ఆరోగ్యం బాగోలేదు అంటూనే పాల్గొన్నాడు. బాల మల్లేష్ మృతికి సిపిఐ రాష్ట్ర సమితికి తీరని లోటు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలిపారు.

అవగాహన వుంటే ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చు

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఎయిడ్స్ పట్ల అవగాహన వుంటే వ్యాప్తిని అరికట్టవచ్చని రాణీ తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మైదుకూరు రోడ్డు లోని కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ జబ్బుకు కారణమైన హెచ్ఐవి క్రిమి ప్రధానంగా లైంగికంగా వ్యాప్తి చెందుతుందని దీని పట్ల అప్రమత్తంగా ఉండవలెనని ఈ వ్యాధి వ్యాప్తికి వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమే ఒక ప్రధాన కారణమని, కావున ప్రతి ఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉన్నట్లయితే దీనిని పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎల్ తరుణేంద్ర శేఖర్, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఇన్చార్జి ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేతరులు పాల్గొని హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రతిజ్ఞ చేశారు.

ఏపీలో దంచి కొడుతున్న భారీ వర్షాలు

- కాకినాడపై ఫెయింజల్ తుపాన్ ప్రభావం
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- కోత బారిన తీరప్రాంత గ్రామాలు
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఫెంగల్ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. రాయలసీమ, కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా.. నిన్న రాత్రి నుంచి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరులో కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు పడుతున్నాయి. రోడ్లపై నీరు కూడా నిలుస్తోంది. పెన్నానదిలోకి వర్షపు నీరు పెరుగుతోంది. తిరుమలలో వర్షానికి తోడు ఈదురుగాలులు కూడా వీస్తున్నాయి. భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి అని టీటీడీ తెలిపింది. ఇక కొన్ని జిల్లాల్లో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం వానకు తడిసిపోయింది. దాంతో వారు ఆవేదన చెందుతున్నారు. సముద్ర తీరపు ప్రాంత మత్స్యకారులు, గ్రామస్థులు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ తమ ఇళ్లు, భూములు సముద్రంలో కలిసి పోతాయోనని బెంబేలెత్తిపోతున్నారు. ఫెయింజల్ తుపాన్ ప్రభావం కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంపై తీవ్రంగా చూపింది. గత రెండు రోజులుగా సముద్రంలోని పెను మార్పులు ఏర్పడి రాకాసి అలలు తీవ్ర ప్రభావం చూపాయి. కెరటాల తాకిడికి తీర ప్రాంత గ్రామాలు కోత బారిన పడ్డాయి. విద్యుత్ స్తంభాలు, గృహాలు, చెట్లు నేలకొరిగి సముద్రంలో కలిసిపోయాయి. బాధితులు నిలవడానికి నీడ లేక రోడ్డున పడ్డారు. ప్రధానంగా ఉప్పాడ, మాయాపట్నం సూరాడపేట, కోనపాపపేట గ్రామాలు కోత బారిన పడ్డాయి. నెల రోజుల వ్యవధిలో రెండు తుపాన్ల ప్రభావం తీర ప్రాంత గ్రామాలపై పడటంతో మత్స్యకార కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయి. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఫెంగల్ తుపాను గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం పుదుచ్చేరికి 150 కిలోమీటర్లు, చెన్నైకి 140 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. సాయంత్రానికి తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల వద్ద, కారైకాల్-మహాబలిపురం మధ్య పుదుచ్చేరి సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఈ ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురస్తాయని వాతావరణ శాఖ వివరించింది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలకు అవకాశం ఉన్నట్లు వెల్లడిరచింది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా ఫెంగల్ తుపాన్‌పై విపత్త నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్లు, సీఎంఓ, రియల్ ట్యైం గవర్నెన్స్ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు రియల్ ట్యైంలో అంచనా వేసి అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్టీజీ ద్వారా నిరంతర పర్యవేక్షణతో ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. తుపాన్ కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీంను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందునుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయాత్తం కావాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశాలిచ్చారు. తుపాన్?పై ధాన్యం రైతులు ఆందోళనగా ఉన్నారని, నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలని అధికారులకు చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న మధిర ప్రజలు

నిమ్మకు నీరెత్తిన పోలీసులు

మధిర, నవంబర్ 30 (నిఘా న్యూస్): మధిర పట్టణంలో రోజురోజుకీ దొంగతనాలు పెరుగుతున్నాయి. రాత్రులు కాకుండా పట్టపగలే దొంగలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. అనేక రోజులుగా వరుసగా పట్టణంలో చోరీలు జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుండి ఆరోపణ వినిపిస్తున్నాయి. గురువారం ఒక్కరోజే మధిర పట్టణంలో రెండు గృహాల్లో దొంగలు చోరీ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అదేవిధంగా ఆత్కూర్ లో రైతు ఇంట్లో పట్టపగలు చొరబడి లక్షన్నర రూపాయలను చోరీ చేశారు. అదేవిధంగా మధిర మున్సిపాలిటీ పరిధిలో మదుపల్లిలో నారాయణరెడ్డి నివాసంలో అదేరోజు దొంగలు రెండు లక్షల రూపాయల విలువైన బంగారం, 30 వేల రూపాయల నగదును చోరీ చేశారు. ఒకే రోజు పట్టపగలు నాలుగు గృహాల్లో దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నం చేశారు. మధిర శ్రీనగర్ కాలనీలో చోరీ చేసేందుకు ఒక వ్యక్తి వచ్చి తాళాలు పగలగొట్టే సన్నివేశం సీసీ కెమెరాలు రికార్డు అయింది. మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోరీలు జరగటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నంచేస్తున్నారు. సెప్టెంబర్27నపట్టణంలోఉన్నసిరిపురం ఎస్.బి.ఐ.బ్యాంక్ లో దొంగలు చోరీ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. బ్యాంకు ఎనకవైపు తాళాలు పగలగొట్టి లోపలికి వచ్చారు. లాకర్లను బ్రేక్ చేసేందుకు ప్రయత్నించి విఫలం చెందారు. బ్యాంక్ చోరీ యత్నానికి పాల్పడిన దొంగలను రెండు నెలలు గడిచినా పోలీసులు పట్టుకోలేదు. నవంబర్ 3న పట్టపగలు వైరా రోడ్లో ఉన్న హెూటల్ షట్టర్ పగలగొట్టేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అదేవిధంగా నవంబర్ 5వ తేదీన మధిర పట్టణం రాయపట్నం సెంటర్లో ఒక మహిళ మెడలో పుస్తెలతాడును చోరీ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేసే క్రమంలో ఆమె కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ ముఖ్య కేంద్రంలో వరుసగా దొంగలు చోరీ చేయటానికి ప్రయత్నం చేయటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు సెల్ ఫోన్ పట్టుకొని సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టుకోవడం తప్ప దొంగతనాలు అరికట్టడంలో విఫలం చెందారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మధిర పట్టణంలో జరుగుతున్న దొంగతనాలను నివారించాలని ప్రజల కోరుతున్నారు.

317 జీవోపై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణలో జీవో 317 కారణంగా నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రేవంత్ సర్కారు త్వరలోనే శుభవార్త చెప్పే అవకాశం ఉంది. ఈ జీవో అమలుతో ఇబ్బందులకు గురైన భార్యాభర్తలు, మ్యూచువల్, అనారోగ్య కారణాలున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైలుపై సీఎం రేవంత్ సంతకం చేసినట్టు సమాచారం. 317 జీవోపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ సబ్ కమిటీ మ్యూచువల్, హెల్త్ గ్రౌండ్, స్పౌజ్ ట్రాన్స్‌ఫర్లు జరపాలని కొన్ని రోజుల కిందట ప్రాథమికంగా నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైలును సీఎం రేవంత్ రెడ్డికి పంపగా.. శుక్రవారమే దాన్ని ఆమోదించినట్టు తెలుస్తోంది. అతి త్వరలోనే దీనిపై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఇటీవల సచివాలయంలో ఉపసంఘం సమావేశమైంది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా కేటాయింపు జరగాలని అభిప్రాయపడిరది. స్థానికతకు అవరోధంగా ఉన్న క్లాజ్‌లపై మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు 3 గంటలకుపైగా న్యాయ నిపుణులతో చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల టీ ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించింది. తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహా ఇటీవల అందజేశారు. అంతకుముందు పలు దఫాలుగా సబ్ కమిటీ భేటీ అయ్యింది. ఆయా సందర్భంగా.. 317 జీవో కారణంగా నష్టపోయిన వారి వివరాలు మాత్రమే గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. దీంతో వివిధ శాఖల నుంచి వివరాలు అందాయి. అన్నింటినీ పరిశీలించి, ఉప సంఘం నివేదికను తయారు చేసింది. దాన్నే ముఖ్యమంత్రికి సమర్పించింది. అయితే, సబ్ కమిటీ నివేదికను బయటపెట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

భారీ వర్షాలతో చెన్నై అతలాకుతలం

పలు జిల్లాలలో పాఠశాలలు, కళాశాలలకు సెలవు

9 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటన

చెన్నై, నవంబర్ 30 (నిఘా న్యూస్): ఫెంగల్ తుఫాన్ తమిళనాడును వణికిస్తోంది. తీరం దాటక ముందే కుండపోత వర్షాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ఫెంగల్. భారీ వర్షాలతో అతలాకుతలం అవుతుంది చెన్నై. ఈ తుఫానుపై అధికారులతో సీఎం స్టాలిన్ సమీక్ష నిర్వహించారు. తుఫాను కారణంగా సహాయక చర్యలపై సీంఎ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెన్నై సహా ఆరు జిల్లాల్లో తుఫాన్ తీవ్ర ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ రాత్రికి చెన్నైలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సీఎం స్టాలిన్ సూచించారు. లోతట్టుప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని సీఎం తెలిపారు. ఇప్పటికే తమిళనాడులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెంగల్‌పట్టు, మహాబలిపురం, కడలూరులో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. తుఫాన్ భయంతో ఫ్లై ఓవర్లపై కార్ల పార్కింగ్, సబ్‌వేలను మూసివేశారు. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. అలాగే చెన్నై విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులను సైతం నిలిపివేశారు. ఈ నేపథ్యంలో 9 జిల్లాల పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. రేపు ఆదివారం సాధారణంగా సెలవు. 9 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించిన అక్కడ ప్రభుత్వం. పరిస్థితి అలాగే ఉంటే సోమవారం కూడా సెలవు ప్రకటించే అవకాశం ఉంది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు, మైలాడుతురై, కడలూరు, విల్లుపురం, కళ్లకురిచ్చి, రాణిపేట్కెలో నిరంతర వర్షాల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అలాగే తంజావూరు జిల్లాలో కుంభకోణం, తిరువిడ్కెమరుదూర్ తాలూకాలలో కురుస్తున్న వర్షాల కారణంగా పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు. అయితే తుఫాను కారణంగా పాఠశాల, కళాశాలలకు మరిన్ని సెలవులు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. దీనిపై ఆ రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చలు జరుపుతోంది. అలాగే చెన్నై విమానాశ్రయం నుంచి వెళ్లే విమాన సర్వీసులను సైతం రద్దు చేశారు. నైరుతి బంగాళాఖాతంలో తుఫాను "ఫెంజాల్" గత 6 గంటల్లో గంటకు 07 కి.మీ వేగంతో ఉత్తర-వాయువ్య దిశగా కదులుతోంది. ఇది ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాన్ని కారైకాల్, పుదుచ్చేరి సమీపంలోని మహాబలిపురం మధ్య దాటే అవకాశం ఉందని, నవంబర్ 30 మధ్యాహ్నం సమయంలో గంటకు 70-80 కి.మీ నుండి 90 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, దాదాపు పశ్చిమ వాయువ్య దిశలో కదులుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తుఫాను తీరం దాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అత్యవసర పనులకు మినహా ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లకుండా సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. అలాగే, చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, విల్లుపురం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలు, రాణిపేట్, తిరువణ్ణామల్కై, వేలూరు, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు, తిరువారూర్, మైలాడుతురై, నాగపట్నం జిల్లాలు, హేకరాయ్‌లో కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుచిరాపల్లి, పుదుకోట్టై, కరూర్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

ఉప్పల్ టీడబ్ల్యూజేఎఫ్ సమావేశంలో నాయకుల డిమాండ్

కాప్రా, నవంబర్ 30 (నిఘా న్యూస్): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉప్పల్ నియోజక వర్గం సమావేశం నిర్వహించారు. శనివారం కాప్రా సర్కిల్ కుషాయిగూడ నాగార్జున నగర్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, కార్యదర్శులు తన్నీరు శ్రీనివాస్, సలీమ బేగం హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు వారి బాధ్యత హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ హామీల అమలు తీరుపై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టిడబ్ల్యుజేఎఫ్ చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్రంలో ముప్పై మూడు జిల్లాలలో జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. ఫెడరేషన్ లో సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఏ సమస్య ఉన్న అనుక్షణం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా కలిసి కట్టుగా పని చేద్దాం అని పేర్కొన్నారు. జర్నలిస్టులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ అనే గొడుగు కింద సమస్యల సాధనకు కృషి చేస్తున్న సందర్భంలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా పోరాటం కొనసాగించాలని ఎవరూ అధైర్య పడవద్దని చెప్పారు. అనంతరం ఉప్పల్ నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వేణుగోపాల్ గౌడ్,సిద్ధగౌని అమరేందర్ గౌడ్, అశోక్ గౌడ్,పద్మా రెడ్డి,పటేల్, ప్రసాద్, మల్లేష్ గౌడ్, కుమార్ గౌడ్, కృష్ణ, కిరణ్, శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోరే లక్ష్మణ్ ఔదార్యం

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ లో శనివారం ఇద్దరు వృద్ధులు అనారోగ్యం చేత చికిత్స పొందుతూ మరణించగా మూడు రోజులు గడిచిన అంత్యక్రియలు చేయడానికి బంధువులు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది అంత్యక్రియలు చేయడానికి ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, బాల నరసింహ, కృపా అగ్ని శరూన్ ట్రస్ట్ సభ్యులు పాపిషెట్టి వెంకట లక్ష్మమ్మ, సుమన్ బాబు, సురేష్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అబాకస్ ఉచిత అవగాహన

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘాన్యూస్): విదేశీ విద్యను అభ్యసించాలనుకునే యువతీ యువకుల కోసం అబాకస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌సంస్థద్వారాఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ భూపేంద్ర తెలిపారు. శనివారం స్థానిక శ్రీరాముల పేటలోని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కార్యాలయంలో యువత విదేశీ విద్యను సాకారం చేసుకునేందుకు పాటించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ భూపేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో అబాకస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ వుందని, వారి ఆధ్వర్యంలోనే ప్రొద్దుటూరు లో కూడా విదేశీ విద్య కోసం అవసరమయ్యే పరీక్షలు, పత్రాలు, వివిధ రకాల విదేశీ యూనివర్శిటీలలో ప్రవేశం, ప్రాసెసింగ్ ఫీ లేకుండా ఉచితంగా చేర్చేందుకు, స్కాలర్షిప్ ఇప్పించేందుకు తమ అబాకస్ సంస్థ కృషి చేస్తుందని వివరించారు. హైదరాబాద్ లో విజయవంత మైన ఈ సంస్థ సేవలను ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల యువత వినియోగించుకోవాలని సూచించారు.

ఉప్పల్ లో జరిగిన ఐ ఫోకస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ మంత్రి హరీష్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.

-ఉప్పల్, నవంబర్ 30 (నిఘా న్యూస్):

కౌన్సిల్ నుండి.. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ వాకౌట్

- రసాభాసగా మారిన ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- టిడ్కో ఇళ్ళ విషయమై టిడిపి, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

ప్రొద్దుటూరు, నవంబర్ 30 (నిఘా న్యూస్): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సాధారణ భవనంలో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం రసాభసగా మారింది. ప్రొద్దుటూరులో నిర్మించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాల కూల్చివేతపై ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని కొద్దిసేపు ఉద్రుత పరిస్థితులు ఏర్పడ్డాయి. నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 32 అంశాలతో కూడిన అజెండాను అధికారులు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ముందుగా అంశాలను చర్చించడంలో సజావుగా సాగిన సమావేశం ఒక్కసారిగా టిడిపి వైసిపి కౌన్సిల్ సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. ముందుగా వైసిపి కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో చేపట్టిన ప్రాజెక్టు కు సంబంధించిన భూమిలో 3,4,5 సెంట్లు వారీగా విక్రయం చేశారని, చాలామంది ప్రజలు ఉద్యోగులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల కాలం ముగిసినా ఆ ప్రాజెక్టుపై ఎలాంటి పురోగతి లేదన్నారు. కానీ విక్రయదారులు ఆ ప్రాజెక్టు పరిస్థితి ఏ విధంగా ఉందో అని భయాందోళనకు చెందుతున్నారని మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని ఆ ప్రాజెక్టు స్థితిగతులను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. దీంతో కల్పించుకున్న ఎమ్మెల్యే వరద నిరుపేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపడితే వాటిని కూల్చడానికి ఎలా మనసొచ్చింది వైసిపి ప్రభుత్వాన్ని కానీ ప్రశ్నించారు. అందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాత కోట బంగారు రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 4 ఇళ్లకు గాను 300 కిడ్కో ఇల్లు నిర్మాణం చేపట్టారని అవి కూడా తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందని అన్నారు. వాటికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి కష్టతరమైందని గత వైసిపి ప్రభుత్వం తొలగించిందని సమాధానం ఇచ్చారు. అందుకు లబ్ధిదారులకు వారు చెల్లించిన సొమ్మును తిరిగి వారి ఖాతాలలో జమ చేసిందని చెప్పుకొచ్చారు. ఆ లబ్ధిదారులకు జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాకుండా నియోజకవర్గంలో 24 వేల ఇల్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ అంశాన్ని కల్పించుకున్న టిడిపి కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ఎక్కడ చేపట్టారో ప్రజలకు తెలపాలని ఇంతవరకు ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి చేయలేదని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మూడు లే అవుట్‌లలోని జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం చూపిస్తామని అనగా చూపించాలని కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి మహిళా కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి దగ్గరికి దూసుకొని వెళ్లారు.అంతటితో ఒక్కసారిగా సమావేశంలో ఉద్రుత పరిస్థితి ఏర్పడింది. అందుకు ఆగ్రహించిన వైసీపీ కౌన్సిలర్లు ఒక మహిళా కౌన్సిలర్‌పై దురుసుగా ప్రవర్తిస్తారా అని ఇరుపక్షాలు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ పరిణామాలను గమనించిన వైసిపి కౌన్సిలర్‌లు సమావేశాన్ని బైకాట్ చేయగా మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో పాటు సమావేశ భవనం నుంచి వెళ్ళిపోయారు. అనంతరం ఎమ్మెల్యే వరద సమక్షంలో సమావేశంలో పట్టణంలో సమస్యలపై చర్చించారు. కానీ మున్సిపల్ చైర్ పర్సన్ లేని కారణంగా మిగిలిన అంశాలు కౌన్సిల్ ఆమోదం పొందలేకపోయాయి. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణం... పునాదుల స్థాయిలోనే ఫిర్యాదు

రెండు అంతస్తుల నిర్మాణం చేపట్టినా చర్యలు శూన్యం
మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ తీరుపై సర్వత్రా విమర్శలు
చర్యలు తీసుకునే దెన్నడని ప్రశ్నల వర్షం

ఇల్లందు, నవంబర్ 30 (నిఘా న్యూస్): అధికార పార్టీలో కొనసాగుతున్న నేత ఇల్లందు మున్సిపల్ పరదిలోని రెండో వార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డదారిలో నిర్మాణం చేపడుతున్నారని ప్రజలు ఆరోపణ చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానర్ ప్రేక్షక పాత్ర పోషిస్తూ కల్లప్పగించి చూడటమే తప్ప, నోటీసులు జారీచేసే ఆలోచన మరచిన అధికారుల తీరు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత అధికారి తీరు తానా అంటే తందానా అనేలా ఉండేదని. అతని స్థానంలో వచ్చిన అధికారి అదే బాటలో నడవడం ప్రజలను నిరుత్సాహానికి గురి చేస్తుందంటూ పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అట్టి ఫిర్యాదును పక్కన పడేయడం పట్ల స్థానికులు విచారం వ్యక్తపరిచారు. కాలాయాపనగా వస్తున్నామా వెళ్తున్నామా అనే విధంగా మున్సిపల్ కార్యాలయం తయారయ్యిందంటూ బహిరంగంగా ఆరోపణలు ఉన్నాయి.నాలుగు నెలుగా ఫిర్యాదు చేస్తున్న చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తూ.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ, నిలుపుదల చేయలేని అధికారులకు ముడుపులు పెద్ద మొత్తంలో ముట్టినట్టు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ ప్రజలకు కాకుండా అక్రమార్కులకు అండగా ఉండే అధికారులపై జిల్లా అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రికెట్ లీగ్ టైటిల్ గెలుచుకున్న ప్రావిడెన్స్ గ్లోబల్ సెంటర్

హైదరాబాద్, నవంబర్ 30 (నిఘా న్యూస్): నగరంలోని కేఎల్ ఆర్ క్రికెట్ గ్రౌండ్ లో ఇటీవల జరిగిన సిఐఐ తెలంగాణ కార్పొరేట్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టైటిల్ ను ప్రావిడెన్స్ గ్లోబల్ సెంటర్ 76 పరుగుల తేడాతో అరబిందో ఫార్మా లిమిటెడ్ పై గెలిచిందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ సంతోష్ జె 73బంతుల్లో 208పరుగులు చేయడంతో ప్రావిడెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసిందన్నారు. అరబిందో ఫార్మా లిమిటెడ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేయగా మొత్తం 354 పరుగులు చేసిన సంతోష్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించిందని తెలిపారు.

వరంగల్ కోటలో... ఏడవ తరగతి విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశాల ప్రత్యక్ష బోధన

వరంగల్, నవంబర్ 30 (నిఘా న్యూస్): వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ కోటలో ఉపాధ్యాయులు ప్రత్యక్ష బోధన అనుభూతిని అందివ్వడం వలన విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేసే ఆవశ్యకత రెట్టింపు అవుతుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కృష్ణ కాలనీ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు సందీప్ కుమార్ అన్నారు. ఏడవ తరగతి తెలుగు వాచకంలో ఉన్న శిల్పి పాఠాన్ని కాకతీయుల కాలంలో వైభవంగా వెలుగొందిన ఖిలా వరంగల్‌లో శనివారం శిల్పాల మధ్య తెలుగు ఉపాధ్యాయులు చింతం నాగరాజు,సుభద్రలు బోధించారు.కఠినమైన శిలలను జీవంవుట్టి పడే అందమైన శిల్పాలుగా చెక్కిన శిల్పి పై గౌరవాన్ని పెంచుకోవడంతో పాటు,ఎంతో విలువైన శిల్ప సంపదను కాపాడుకొని ముందు తరాలకు అందించాలనే ఆలోచన విద్యార్థులకు వస్తుందని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడవ తరగతి విద్యార్థులు 50 మంది పాల్గొని విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా పొందారు.

పెద్దపులి సంచారంతో... వణుకుతున్న శ్రీకాకుళం ప్రజలు

శ్రీకాకుళం, నవంబరు 30 (నిఘా న్యూస్): గత మూడు రోజులుగా పెద్దపులి సంచరిస్తున్నందున శ్రీకాకుళం జిల్లా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.మూడు రోజుల క్రితం సంతబొమ్మాళి మండలం పెద్ద కేసినాయుడు పేట గ్రామంలో గుర్తు తెలియని జంతువు దాడి చేసి ఆవును చంపివేసింది. ఈ సంఘటన అర్ధరాత్రి జరగడంతో తీవ్రంగా భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు పరిశీలించి పెద్దపులి అడుగులుగా గుర్తించారు. వ్యవసాయ పనులు సమయం అయినందున ఎటువైపు నుండి పులి దాడి చేస్తుందనే భయంతో సంతబొమ్మాళి మండల ప్రాజులు ఆందోళనకు గురి అయ్యారు.ఆ మరుసటి రోజు రాత్రి జాతీయ రహదారి దాటుతుండగా కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో 108సిబ్బంది పెద్దపులిని చూసి ఫోటోలు తీసి పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు తెలియపర్చారు.దీంతో అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచరించే ప్రదేశాలు పరిశీలించి పెద్దపులి అడుగులను గుర్తించి ఈ ప్రాంత ప్రజలను తగు జాగ్రత్తలు తీసుకోవాలి కోరారు. కొండలు సమీపంలో ఉన్నందున ఏ కొండపైన కాపుకాసి దాడి చేస్తుందని రైతులు, వ్యవసాయ కూలీలు, పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో శనివారం సారవకోట మండలం జమచక్రం ప్రాంతంలో పొలం పనులకు వెళ్లిన స్థానిక రైతు పొలంలో ఉన్న అడుగులను పెద్దపులి ఆనవాలుగా ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల ప్రజలు పులి వేరే ప్రాంతానికి వెళ్ళినందున ఇక పొలం పనులు భయం లేకుండా చేసుకోవచ్చని ఊపిరి పీల్చుకున్నారు. పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని గుర్తించి అటవీ శాఖ అధికారులు వలలు వేసి మాటు కాసి పులిని పట్టుకొని ప్రాణ నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.ఈ విషయంలో జిల్లా కలక్టర్ ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా పెద్దపులిని పట్టుకొని సుదూర ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతానికి గానీ, లేకుంటే జూకు గానీ అప్పగించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పూడూరు పత్తి గోడౌన్‌లో కాలి బూడిదైన పత్తి

కోట్లలో ఆస్తి నష్టం
కుప్పకూలిన భారీ గోదాం

మేడ్చల్, నవంబర్ 30(నిఘా న్యూస్): మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మేడ్చల్ మండల పరిధిలోని గోసాయిగూడలో కార్టూన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కోట్ల రూపాయల విలువ గల పత్తి కాలి బూడిదయింది. ఈ ఘటనలో గోడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులు సురక్షితంగా బయట పడ్డారు. ఆదిలాబాద్ బ్రాంచ్ కి చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోడౌన్ పూడూరు మండలంలోని గోసాయిగూడలో ఉంది. ఆదిలాబాద్‌లో కొనుగోలు చేసిన పత్తిని భారీ గోడౌన్‌లో భద్రపరిచారు. మధ్యాహ్నం గోడౌన్ లో వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మిరుగులు పత్తిపై పడడంతో మంటలు అంటుకొని చూస్తుండగానే కోట్ల రూపాయల విలువగల పత్తి ఖాళీ బూడిదయింది. మంటలు ఎగిసి పడడంతో స్థానికులు ఆందోళన చెందారు. పక్కనే కెమికల్ గోడౌన్లు ఉండడంతో ఆ మంటలు ఎక్కడ అంటుకుంటాయోనని ఆందోళన చెందారు. ఎగిసి పడ్డ మంటలతో భారీ గోడౌన్ సైతం కుప్పకూలి పోయింది. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు. సాయంత్రం వరకు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రాత్రి వరకు మంటలు ఎగిసి పడ్డాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం

- 69 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- హాజరైన ఎమ్మెల్యే సబితా రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జి కేఎల్ఆర్

మహేశ్వరం, నవంబర్30 (నిఘా న్యూస్): మహేశ్వరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) ఆధ్వర్యంలో రూ.69 కోట్ల అభివృద్ధి పనులకు మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఐటీ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమం, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తామని, దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా అధికార యంత్రాంగం కొనుగోళ్లు చేసేలా అన్ని చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. పార్టీలకు అతీతంగా మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని కిచ్చెన్న తెలిపారు. కందుకూరు మండల ఫోర్త్ సిటీలో భవిష్యత్ అవసరాలను తగ్గట్టు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని లక్ష్మారెడ్డి తెలిపారు. కొత్త పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారని కే ఎల్ ఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, కో ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, కెంచె లక్ష్మీనారాయణ, జల్పల్లి మున్సిపల్ టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎం.ఏ.సమీర్, నాయకులు యంజాల జనార్దన్, ఎలిమినేటి అమరేందర్ రెడ్డి, యూసుఫ్ ఖాద్రి, కప్పాటి పాండురంగారెడ్డి, బర్కత్ అలీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

బీరంగూడలో పోటీలకు హాజరైన బిఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్

బీరంగూడ, నవంబర్ 30 (నిఘా న్యూస్): పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు సీజన్-8 శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ కబడ్డీ పోటీలకు పటాన్‌చెరు బీఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించడం, యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంచడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. క్రీడలు మన ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని సూచిస్తూ, అలాంటి యువతకు మద్దతు ఉంటుంది, అని ఆయన తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. పటాన్‌చెరు యువత మరింత ఆసక్తి కనబరిచినట్లయితే, వారికి ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించడంలో తాను ముందుండి సహాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సౌదీలో శ్రీకాకుళం వాసుల ఆకలి కేకలు

- రెండు నెలలుగా నరకయాతన
- ఇచ్ఛాపురం నుండి 30 మంది యువకుల ప్రయాణం
- ట్రెయింట్ ఇనిస్ట్యూట్, సౌదీలోని కొంబన్ కంపెనీకి ఒప్పందం
- కేంద్ర రాష్ట్ర మంత్రులకు మొరపెట్టుకున్న తల్లిదండ్రులు

శ్రీకాకుళం, నవంబరు 30 (నిఘా న్యూస్): పొట్ట కూటి కోసం విదేశాలకు పనుల కోసం వెళ్లిన కార్మికులు కంపనీ పనులు చేయించుకొని వేతనాలు ఇవ్వక పోవడంతో పస్తులతో రెండు నెలలుగా ఆకలితో అలమటిస్తూ సౌదీలో కార్మికులు నరకయాతన అనుభవిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం, పలాస నియోజకవర్గం, ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి సుమారు ముప్పై మంది యువకులు పొట్టకూటి కోసం సౌదీ వెళ్లారు. అంతకు ముందు ఇచ్ఛాపురం, పూండిలో ఉన్న ట్రెయింట్ ఇనిస్ట్యూట్ వారు డబ్బులు తీసుకొని సౌదీలో ఉన్న కొంబన్ అనే కంపెనీకి ఒప్పందం తీసుకొని కార్మికులను పంపించారు. అయితే అక్కడ రెండు నెలలుగా పని చేయించుకొని జీతాలు ఇవ్వక నానా ఇబ్బందులు పడుతున్నారు.

వారి సొంత డబ్బులతో కడుపు నింపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజులుగా చేతులు డబ్బులు లేక జీతాలు ఇవ్వక ఆకలితో అలమటిస్తున్నామని భాదితులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపారు. కంపెనీ యాజమాన్యానికి అడిగితే మీరు ఏం చేసుకుంటారు చేసుకోండి, ఇలా అడిగితే మీరు ఎలా ఇండియా వెళ్తారు అని బెదిరింపులకి పాల్పడుతున్నారని, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంపించిన ఇనిస్ట్యూట్ వారికి ఫోన్లో అడిగితే పంపించిన వరకే మా బాధ్యత, తర్వాత మాకు సంబంధం లేదని వారు చేతులెత్తేయడంతో ఇక దిక్కు ఎవరని వారు రోదిస్తున్నారు. కొంబన్ కంపెనీ వారు జీతాలు ఇవ్వండి అంటే బెదిరింపులు పాల్పడుతున్నారని ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు. రామ్మోహన్ నాయుడుకి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి తల్లిదండ్రుల ద్వారా తెలియజేయడం జరిగింది. కానీ ఇంతవరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో మాకు భయంగా ఉందంటూ మేము ఇక్కడే చనిపోతాము ఏమో అని ఆందోళన గురవుతున్నామని కుటుంబ సభ్యులతో మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకొని, మాకు ఇండియా రప్పించే ప్రయత్నం చేయాలని చేతులు జోడించి వేడుకుంటున్నామని వారు ఆవేదనగా తెలిపారు. ఇలా విదేశాల్లో మోసపోయిన కార్మికులకు గతంలో ఎం.పి.రామ్మోహన్ నాయుడు స్వదేశానికి తీసుకువచ్చిన సంఘటనలు ఉన్నాయని,సౌదీలో మోసపోయి ఆకలితో అలమటిస్తున్న వారిని స్వదేశానికి తీసుకువచ్చి ఆదుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నాయుడుకు, ఎమ్మెల్యే అశోక్ బాబుకు బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బతుకమ్మ కుంట ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు

అంబర్‌పేట, నవంబర్ 30 (నిఘా న్యూస్): అంబర్ పేట బతుకమ్మ కుంట ప్రధాన రోడ్డు వద్ద అక్రమంగా వెలిసిన దుకాణాలను జిహెచ్ ఎంసి సర్కిల్-16 అధికారులు, ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు.'నిఘా' తెలుగు జాతీయ దినపత్రికలో బతుకమ్మ కుంట రహదారిపై ఫుట్ పాత్ ఆక్రమణలు పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, ట్రాఫిక్ ఏసిపి సంపత్ కుమార్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హేమలత, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లెనిన్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది బతుకమ్మ కుంట ప్రధాన రహదారిపై ఆక్రమంగా వెలిసిన దుకాణాలను, టెంట్లను తొలగించారు. అనంతరం జిహెచ్ఎంసి సిబ్బంది ఆ ప్రాంతంలోని లారీలలో తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి సంపత్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు,ఫుట్ పాత్ లను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిఘా ఎఫెక్ట్..

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com